ప్రతిపక్షం

www.prathipaksham.in

సోమవారం 09.03.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 348 పేజీలు: 8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

28 నుంచి ఐపీఎల్ 8

విశ్వ విజేత ఇండియా

వరుసగా మూడోసారి టీ20 ఛాంపియన్

డిఫెండింగ్ ఛాంపియన్ భారత జట్టు చరిత్ర సృష్టించింది. స్వదేశంలో సంపూర్ణ ఆధిపత్యంతో రికార్డు స్థాయిలో మూడోసారి టీ20 ప్రపంచకప్‌ను కొల్లగొట్టింది. ఏకపక్షంగా సాగిన ఫైనల్లో అసలైన ఆటతో న్యూజిలాండ్‌ను చిత్తుగా ఓడించింది టీమిండియా. ఓపెనర్లు సంజూ శాంసన్(89), అభిషేక్ శర్మ(52), ఇషాన్ కిషన్(54)ల మెరుపులతో ప్రత్యర్థిని సగం దెబ్బతీసిన సూర్యకుమార్ యాదవ్ సేన.. బుమ్రా(4-15), అక్షర్ పటేల్(3-27) సంచలన బౌలింగ్‌తో పడగొట్టింది. పరుగు విజయంతో పొట్టి కప్‌లో మరే ఆతిథ్య జట్టుకు సాధ్యపడని విధంగా ప్రపంచకప్‌ను పట్టేసింది.

...:: 8లో

పాలమూరు–రంగారెడ్డి 30 నెలలలో పూర్తి

- 2027 మార్చి నాటికి కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్
- రూ.27 వేల కోట్లు ఖర్చు చేసి బీఆర్ఎస్ చుక్కనీరివ్వలేదు
- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 8: 30 నెలల వ్యవధిలో పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అదే విదంగా 2027 మార్చి మాసంతానికి కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్ ప్రాజెక్టులను పూర్తి చేసి సమృద్ధిగా సాగు నీరు, త్రాగు నీరు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. మహబూబ్ నగర్ జిల్లాతోసహా దక్షిణ తెలంగాణా ప్రాంత రైతాంగానికి సరిపడా సాగు నీరు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని ఆయన

...:: మిగతా 2లో

ఇది ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ

...:: 2లో

ఈ సిటీ అభివృద్ధికి అనేక ప్రాజెక్టులు: సీఎం

ప్రజా ప్రభుత్వంలో మహిళలకు సరైన గుర్తింపు

ఎక్కడ అవకాశం ఉన్నా మహిళలకు అందలం

> మహిళలకు సరైన గుర్తింపు ఇవ్వాలని ప్రజాప్రభుత్వం నిర్ణయించింది. ఎక్కడ అవకాశం ఉన్నా, ఉన్నత పదవుల్లో మహిళలను నియమిస్తున్నాం. హైదరాబాద్ కలెక్టర్‌గా మహిళ బాధ్యత వహిస్తున్నారు. ఎస్ఐబీ అధిపతిగా మహిళను నియమించాం. వెయ్యి బస్సులకు మహిళలు యజమానులుగా ఉన్నారు. వెయ్యి మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి చేసే వారిగా స్వయం సహాయక బృందాలను తయారు చేశాం. తెలంగాణ మహిళలు తయారు చేస్తున్న వస్తువులను అమెజాన్‌లో పెట్టి ప్రపంచానికి అందిస్తున్నాం.
>
> -సీఎం రేవంత్‌రెడ్డి

- యజమానులుగా మహిళలు
- అమ్మాయిలకు ఈవీ స్కూటీలు
- కాలుష్య రహిత హైదరాబాద్
- మూసీ ప్రక్షాళన వద్దంటున్నారా?
- గాంధీ విగ్రహంపై దుష్ప్రచారం
- 70 కోట్లయితే 500 కోట్లంటూ విష ప్రచారం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మండిపాటు
- ప్రజాభవన్‌లో ఘనంగా మహిళా దినోత్సవం
- మహిళా జర్నలిస్టులకు సన్మానం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 8: రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహానగరాన్ని కాలుష్య రహిత నగరంగా మార్చుతున్నట్లు ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. రెడ్, ఆరెంజ్ కేటగిరి పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు పంపిస్తామని చెప్పారు. ఉక్కు మహిళ సోనియాగాంధీ సంకల్పంతోనే తెలంగాణ వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మహిళలకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ప్రజాభవన్‌లో ఆదివారం నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు, ఈ సందర్భంగా మహిళా జర్నలిస్టులకు సన్మానం చేశారు.

మహిళలకు కాంగ్రెస్ పార్టీలోనే గుర్తింపు

మహిళా జర్నలిస్టులకు ప్రత్యేక గుర్తింపు ఇస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. దేశంలోని ఏ పదవైనా మహిళలకు ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ అని, ఉక్కు మహిళ సంకల్పంతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, మహిళలకు సరైన గుర్తింపు ఇవ్వాలని ప్రజాప్రభుత్వం

...:: మిగతా 2లో

ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై

ఇరాన్ ప్రతీకార దాడులు

- అమెరికా నౌకాదళంపై దాడి
- 21 మంది జవాన్ల మృతి!
- కువైట్ టవర్‌పై డ్రోన్ దాడి
- మంటల్లో టెహ్రాన్ నగరం
- మరిన్ని సర్‌ప్రైజ్‌లు ఇస్తాం: నెతన్యాహు
- సుప్రీం నియామకంలో మా అనుమతి తీసుకోవాల్సిందే
- లేకపోతే అతను ఎక్కువ కాలం ఉండడు: ట్రంప్

...:: 2లో

సాఫ్ట్ వేర్ ఉద్యోగులు రైతులుగా మారే రోజులు రావాలి

- రసాయనాల్లేని సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం
- రైతును రాజు చేయడమే మోదీ లక్ష్యం
- జైకిసాన్ నినాదాన్ని ఆచరణలో చూపుతున్న కేంద్రం
- రైతులకు లాభం కలిగించేందుకు కేవీకే కృషి అభినందనీయం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 8: ఉద్యోగులు కూడా రైతులుగా మారి వ్యవసాయం చేసే స్థాయికి రావాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆకాంక్షించారు. దేశానికి అన్నం పెడుతున్న రైతులు తన కాళ్లమీద తాను నిలబడేందుకు ప్రత్యేకంగా శిక్షణిస్తూ వారి పంట ఉత్పత్తులను మార్కెటింగ్ చేసి విక్రయిస్తూ లాభాలు గడించేలా శిక్షణ ఇస్తున్న ఏకలవ్య గ్రామీణ ఫౌండేషన్, కృషి విజ్ఞాన కేంద్రం చేస్తున్న క్రుషి మరువలేనిదని కొనియాడారు. రైతును రాజు చేయడమే లక్ష్యంగా మోదీ ప్రభుత్వం పనిచేస్తుందని, అందులో భాగంగా విస్తృత

...:: మిగతా 2లో

మహిళలు లేకుండా తెలంగాణ ఉద్యమమే లేదు

- సామాజిక తెలంగాణ సాధనలో మహిళలదే కీలక పాత్ర
- మహిళలకు సమాన హక్కులు ఇంకా పూర్తి స్థాయిలో రాలేదు
- ప్రతిరోజు మహిళలను గౌరవించే పరిస్థితులు రావాలి
- మహిళల గౌరవం మహిళా దినోత్సవానికి పరిమితం కాకూడదు
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

చిటుకుల మైసారెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదారాబాద్, మార్చి 8: మహిళలు లేకుండా తెలంగాణ ఉద్యమమే లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. సామాజిక తెలంగాణ సాధనలో కూడా మహిళలదే కీలక పాత్ర కావాలని ఆమె పేర్కొన్నారు. మహిళలకు పూర్తి స్థాయి

...:: మిగతా 2లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ – 6.30 (సోమవారం సాయంత్రం)

సహర్ – 5.06 (మంగళవారం ఉదయం)

దేశాన్ని రాజ్యాంగాన్ని అవమానించింది

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బెంగాల్ పర్యటనలో ప్రొటోకాల్ ఉల్లంఘనపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ఢిల్లీలోని పలు ప్రాజెక్టులను ప్రారంభించిన మోదీ, బెంగాల్‌లోని టీఎంసీ ప్రభుత్వం రాష్ట్రపతిని తీవ్రంగా అవమానించిందని ఆరోపించారు.

7

ప్రొటోకాల్ లోపాలపై వివరణ ఇవ్వండి

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పర్యటనలో లోపాలను కేంద్రం సీరియస్‌గా తీసుకుంది. ఏర్పాట్లపై వివాదం నెలకొనడంతో కేంద్ర ప్రభుత్వం బంగాల్ ప్రభుత్వాన్ని వివరణ కోరింది. ఆదివారం సాయంత్రం 5 గంటలలోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది.

7

జేడీయూలో చేరిన నితీశ్ కుమారుడు

బిహార్ సీఎం నీతీశ్‌కుమార్ కుమారుడు నిశాంత్ కుమార్ జేడీయూలో చేరారు. పట్నాలోని జేడీయూ హెడ్‌క్వార్టర్‌లో జరిగిన కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు.

7

మహిళా సంక్షేమంలో తెలంగాణ అగ్రగామి

- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 8 : దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్రంగా తెలంగాణ అగ్రభాగాన ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం ఇక్కడి ప్రజా భవన్ లో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ప్రత్యేక అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని రంగాల్లో పురుషుల కంటే మహిళలకే పెద్దపీట వేస్తున్నామని దీనిలో భాగంగా రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసే ప్రక్రియలో భాగంగా సున్నా శాతం వడ్డీతో ఇంతవరకు 23వేల కోట్ల రూపాయిలను అందించడం జరిగిందన్నారు. అంతేగాక రానున్న కాలంలో దాదాపు 24 25 వేల కోట్ల రూపాయిలను అందించి వారిని ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు సంకల్పించినట్లు తెలిపారు. సోలార్ ప్యానల్స్ , పెట్రోల్ బంకల ఏర్పాటు, ప్రైవేటు బస్సులకు యజమానులుగా చేసే పథకాలతో పాటు ప్రత్యేకంగా తాను చూసే ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్ల పట్టాలు మహిళల పేరిటే ఇస్తున్నామని తెలిపారు. మహిళాదినోత్సవం నాడు ఈ ఏడాది మహిళా జర్నలిస్టుల కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు ఈ ప్రత్యేక అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. రాష్ట్ర గౌరవాన్ని పెంచేలా మహిళలకు, మహిళా జర్నలిస్టులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అక్రిడిటేషన్ కార్డుల మంజూరులో కూడా వారికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. రానున్న కాలంలో ప్రజలు ప్రభుత్వాన్ని సమన్వయం చేసేలా మీ నుంచి ఉత్తమ పాత్రికేయ సేవలు కావాలని మంత్రి పొంగులేటి అభిలషించారు.

మహిళలు లేకుండా ఉద్యమమే లేదు

మొదటిపేజీ తరువాయి

సమాన హక్కులు ఇంకా రాలేదని చెప్పారు. 50 శాతం హక్కులు వచ్చిన తర్వాతే చట్టాల మార్పులపై చర్చ చేయాలని అన్నారు. అంతవరకు మహిళల చట్టాలను బలహీనపరచే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు. మహిళల గౌరవం ఒక్క మహిళా దినోత్సవానికి మాత్రమే పరిమితం కాకూడదని, ప్రతి రోజు మహిళలను గౌరవించే పరిస్థితులు సమాజంలో ఏర్పడాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం తెలంగాణ జాగృతి కేంద్ర కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మహిళలతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. "గివ్ హర్ స్పేస్" పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కవిత మీడియా, రాజకీయ పార్టీలు మహిళా దినోత్సవం రోజునే మహిళలను గుర్తు చేసుకోవడం సరిపోదన్నారు. ప్రతి రోజూ మహిళల దినోత్సవంలా ఉండే పరిస్థితులు రావాలని చెప్పారు. ఇల్లు, పాఠశాల, ఆసుపత్రి వంటి ప్రతి వ్యవస్థ నడవాలంటే మహిళల పాత్ర ఎంతో కీలకమని ఆమె పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్, కేసీఆర్ లాంటి మహానుభావులు ఈ నేలపై నడిచారంటే వారి తల్లులే కారణమని పేర్కొన్నారు. కొత్త తరం సమాజ సేవలోకి రావాలంటే మహిళల పాత్రే ప్రధానమని తెలిపారు. సమాజంలో ఏ రూపంలో ఉన్నా ఆధిపత్యాన్ని మహిళలు సహించ వద్దని చెప్పారు. పురుషాధిక్యతను ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించరాదని కవిత స్పష్టం చేశారు. మహిళలలో అవగాహన పెంచేందుకు "లీడర్ ప్రోగ్రామ్" ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు కవిత వెల్లడించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ సాధించటంలో జాగృతి కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. ఢిల్లీలో జాగృతి సభ్యులు చేసిన ధర్నాల వల్లే మహిళా బిల్లు వచ్చిందని చెప్పారు. జనగణన పేరుతో అమలు ఆలస్యం చేయడం సరికాదని పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికైనా మహిళా బిల్లు అమల్లోకి రావాలని డిమాండ్ చేశారు. అగ్రకులాలు, రిజర్వేషన్లు ఉన్న కులాల మహిళలే కాకుండా అన్ని కులాల మహిళలు రాజకీయాల్లోకి రావాలని కవిత పిలుపునిచ్చారు. పెద్ద ఇల్లు, చిన్న ఇల్లు, పెద్ద కులం, చిన్న కులం అన్న తేడాలు లేవని మహిళలంతా ఒక్కటే అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చేపట్టిన "స్టాండ్ విత్ హర్" కార్యక్రమాన్ని తీవ్రంగా ఖండించారు. మహిళలతో పురుషులు నిలబడితేనే భద్రత కలుగుతుందా అని ప్రశ్నించారు. మహిళలు, చిన్నారులకు రక్షణ ఇవ్వటం ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు. అది ప్రభుత్వం వేసే బిక్ష కాదని స్పష్టం చేశారు. "స్టాండ్ విత్ హర్" కాదు "గివ్ హర్ స్పేస్" అనేదే తెలంగాణ జాగృతి నినాదమని తెలిపారు. రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం కేవలం 0.0003 శాతం మాత్రమే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్, ఎమ్మెల్యే, మంత్రిగా మహిళలకు అవకాశం ఇచ్చినట్టు చూపించినా వెనుక పురుషులే నిర్ణయాలు తీసుకునే పరిస్థితి ఉందని విమర్శించారు. మహిళలు తప్పనిసరిగా మూడు "ఈ"లను పాటించాలని కవిత సూచించారు. వార్తా పత్రికలు పూర్తిగా చదవడం ద్వారా సమాచారాన్ని పెంచుకోవాలని సూచించారు. ఉపాధి కూడా మహిళలకు ఎంతో ముఖ్యమని చెప్పారు. తమ డబ్బును తామే సంపాదించుకోవాలని ఆమె పేర్కొన్నారు. భర్త లేదా పిల్లల ఆదాయంపై ఆధారపడకుండా ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు.

మహిళలపై పెరిగిన నేరాలు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలపై నేరాలు 22 శాతం పెరిగాయని కవిత ఆరోపించారు. నాగర్‌కర్నూల్‌లో చంటి బిడ్డ మరణించిన ఘటనలో ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. క్రైమ్ రేటు తగ్గించేందుకు పోలీసింగ్ పెంచాలని డిమాండ్ చేశారు. ఉచిత బస్సు కంటే ఉచిత విద్య అందివ్వాలని డిమాండ్ చేశారు. ఇందు కోసం కేరళ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. బతుకమ్మ, బోనాల పండుగల ద్వారా తెలంగాణ ఉద్యమంలో మహిళలను భాగస్వామ్యం చేయగలిగామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కవిత డిమాండ్ చేశారు. మహిళలకు రూ.2500 ఇస్తామని చెప్పి ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి చేపట్టనున్న 99 రోజుల సమీక్షకు ప్రతిగా కాంగ్రెస్ చేసిన 99 మోసాలను ప్రజలకు తెలియజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి మహిళా విభాగం అధ్యక్షురాలు మరిపల్లి మాధవి, జాగృతి రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి భవాని వేముల, లలిత యాదవ్, కృష్ణవేణి, రమాదేవి, హిమజ, వరలక్ష్మి, మనోజ తదితర నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ ఎన్నికలో విదేశీయుల ప్రమేయం అవసరం లేదు. ఖమేనీ వారసుడిని ఎన్నుకోవడంలో ట్రంప్ సాయం అవసరం లేదు. మా దేశ వ్యవహారాల్లో ఇతరులను జోక్యం చేసుకోనివ్వం. ప్రజలు ఎన్నుకున్న అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ లీడర్‌ను నిర్ణయిస్తుంది.
- ఇరాన్ ఫారిన్ మినిస్టర్ అబ్బాస్ అరాఘ్చి

ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై ఇరాన్ ప్రతీకార దాడులు

టెల్ అవీవ్: పశ్చిమాసియా రగు లుతూనే ఉన్నది. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడులు చేయగా, ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై ఇరాన్ విరుచుకుపడింది. శనివారం నాడు ఇచ్చిన మాటను తప్పిన ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ అరబ్ దేశాలపై దాడులను కొనసాగించారు. పైగా పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలపై తమ దాడులను మరింత ముమ్మరం చేస్తామని ఆయన ఆదివారం ప్రకటించారు. దీంతో తీవ్రస్థాయిలో దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియా అట్టుడుకుతున్నది.

బహ్రెయిన్‌లోని నేవీ ఫ్లీట్‌పై దాడి

బహ్రెయిన్‌లోని మనామాలో ఉన్న జుఫైర్ జిల్లాలోని యూఎస్ నేవీకి చెందిన ఐదవ నౌకాదళంపై ఇరాన్ భారీ దాడి చేసింది. ఈ దాడిలో 21 మంది అమెరికా సైనికులు మరణించినట్టు టెహ్రాన్ టైమ్స్ వెల్లడించింది. మనామా కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ నౌకాదళం హెడ్‌క్వార్టర్స్‌పై ఇరాన్ నేరుగా క్షిపణి, డ్రోన్‌తో దాడి చేసింది. బహ్రెయిన్ స్థావరాన్ని రక్షించే పనిలో పేట్రియాట్ పీఏసీ3 వ్యవస్థలు ఉన్నప్పటికీ ఈ దాడి ప్రాంతీయ వైమానిక రక్షణ ప్రభావం గురించి అత్యవసర ప్రశ్నలను లేవనెత్తింది.

మంటల్లో కువైట్ సోషల్ సెక్యూరిటీ టవర్

కువైట్‌లోని సోషల్ సెక్యూరిటీ టవర్‌పై ఇరాన్ దాడి చేయడంతో అది మంటల్లో చిక్కుకుంది. పబ్లిక్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ సోషల్ సెక్యూరిటీ (పీఐఎఫ్ఎస్ఎస్) భవనంపై డ్రోన్‌తో దాడి చేయడంతో పై అంతస్తుల్లో మంటలు వ్యాపించాయి. కువైట్ ఎయిర్‌పోర్టులోని చమురు ట్యాంకలు లక్ష్యంగా 15 డ్రోన్లతో ఇరాన్ జరిపిన దాడిని సౌదీ అరేబియా అడ్డుకుంది. ఆగ్నేయంలో ఉన్న షాయబ్ ఆయిల్ క్షేత్రంపై దాడికి ప్రయత్నించిన 17 డ్రోన్లను కూడా అడ్డుకున్నామన్నారు. అలాగే తాము ఇప్పటివరకు 92 క్షిపణులు, 151 డ్రోన్లను అడ్డుకుని ధ్వంసం చేశామని బహ్రెయిన్ తెలిపింది. తమ దేశంలోని ఒక నీటి శుద్ధి ప్లాంట్‌పై ఇరాన్ ఆదివారం దాడిచేసిందని బహ్రెయిన్ ఆరోపించింది.

సౌదీలో భారతీయుడు మృతి!

సౌదీ అరేబియాపై మిలిటరీ దాడిలో ఒక భారతీయుడు ప్రాణాలు కోల్పోయాడు. దీనిని గుర్తుతెలియని చోట నుంచి జరిగిన దాడిగా సౌదీ అరేబియా సివిల్ డిఫెన్స్ పేర్కొన్నది. ఆదివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ, దక్షిణ రియాద్‌లోని అల్ ఖర్జ్‌లో నివాస ప్రాంతాలపై జరిగిన మిలిటరీ ప్రొజక్టైల్ దాడిలో భారత్, బంగ్లాదేశ్‌కు చెందిన ఇద్దరు పౌరులు చనిపోయారని తెలిపింది.

మరిన్ని సర్‌ప్రైజ్‌లు ఇస్తాం : నెతన్యాహు

ఇరాన్‌రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించింది. చమురు డిపోలే లక్ష్యంగా దాడులు జరిపింది. దీంతో పలుచోట్ల భారీగా మంటలు చెలరేగాయి. నగరమంతా దట్టమైన పొగ కమ్మేసింది. ఖమేనీ మరణంతో ఇరాన్ సుప్రీం పదవికి మరొకరిని నియమించే ప్రయత్నాలు ఆ దేశంలో జోరుగా జరుగుతున్న క్రమంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక హెచ్చరిక చేశారు.

ప్రజా ప్రభుత్వంలో మహిళలకు సరైన గుర్తింపు

మొదటిపేజీ తరువాయి

నిర్ణయించిందని అన్నారు. ఎక్కడ అవకాశం ఉన్నా, ఉన్నత పదవుల్లో మహిళలను నియమిస్తున్నామని, హైదరాబాద్ కలెక్టర్‌గా మహిళ బాధ్యత వహిస్తున్నారని, ఎస్ఐబీ అధిపతిగా మహిళను పెట్టామని, వెయ్యి బస్సులకు మహిళలు యజమానులుగా ఉన్నారని గుర్తు చేశారు. వెయ్యి మెగా వాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి చేసే వారిగా స్వయం సహాయక బృందాలను తయారు చేశామని, తెలంగాణ మహిళలు తయారు చేస్తున్న వస్తువులను అమెజాన్‌లో పెట్టి ప్రపంచానికి అందిస్తున్నామని వివరించారు.

మహిళ ఆర్థిక శక్తి పెరిగినప్పుడే...

మహిళ ఆర్థిక శక్తి పెరిగినప్పుడే ఆ దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందన్న సీఎం, దేశంలో మహిళ శ్రమకు గుర్తింపు లేదని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో కుల, జెండర్ వివక్ష ఉందని, అమెరికాలో కూడా వివక్ష ఉందని కానీ అక్కడ కష్టానికి గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఇక్కడ మాత్రం కష్టపడే వారికి గుర్తింపు ఉండదని, మహిళల ఆర్థిక శక్తిని పెంచాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రం ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పెంచే ప్రణాళికలను తయారు చేశామని పేర్కొన్నారు.

ఈవీ వాహనాలకు జీరో ట్యాక్స్

హైదరాబాద్‌ను పొల్యూషన్ ఫ్రీ నగరంగా మార్చాలని రేవంత్ రెడ్డి తెలిపారు. చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి హైదరాబాద్‌ను అభివృద్ధి చేశారని కొనియాడారు. రెడ్, ఆరెంజ్ కేటగిరి పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు పంపిస్తామని, హైదరాబాద్‌లోని డీజిల్ బస్సులను 2026 డిసెంబర్‌లోపు జిల్లాలకు తరలిస్తామని, హైదరాబాద్‌లో 100 శాతం ఈవీ బస్సులను తెస్తున్నామని అన్నారు. డిసెంబర్ 9లోపు డీజిల్ బస్సులు హైదరాబాద్‌లో ఉండవని, హైదరాబాద్‌లో ఏసీ ఈవీ బస్సులు తెస్తామని తెలిపారు. ఈవీ వాహనాలు కొనుక్కుంటే జీరో ట్యాక్స్ అని, కళాశాలకు వెళ్లే అమ్మాయిలకు ఈవీ స్కూటీలను ఇవ్వాలనుకుంటున్నామని సీఎం వెల్లడించారు.

మూసీ ప్రక్షాళనపై దుష్ప్రచారం

హైదరాబాద్‌లో కాలుష్యం, దోమలు ఎక్కువగా ఉన్నాయంటున్నారని, మూసీని ప్రక్షాళన చేస్తామంటే అడ్డుపడుతున్నారని రేవంత్ రెడ్డి పరోక్షంగా బీఆర్ఎస్, బీజేపీ నేతల తీరుపై మండిపడ్డారు. మూసీ ప్రక్షాళన వద్దంటున్నారా? తొలగింపులు వద్దంటున్నారో స్పష్టత ఇవ్వాలని ఆపార్టీ నేతలను కోరారు. నష్ట పరిహారం ఇచ్చే బఫర్ జోన్‌లోని ఇళ్లను తొలగిస్తామని స్పష్టం చేశారు. 50 మీటర్ల బఫర్ జోన్ అనేది చట్టంలో ఉంది తాను మార్చలేనని, నిర్వాసితులకు ప్రత్యామ్నాయం చూపిస్తామని హామీ ఇచ్చారు. ఎవరూ మీతో ఉండరని, ఓట్ల కోసమే మీ దగ్గరకు వస్తున్నారని, ఈ విషయాన్ని గ్రహించాలని కోరారు. మూసీ నిర్వాసితులకు ఏం కావాలో చర్చిస్తే బాగుంటుందని అన్నారు. ఈనెల 13వ తేదీన మూసీ పునరుజ్జీవంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇస్తామని చెప్పుకొచ్చారు. డీపీఆర్ కూడా ప్రెజెంట్ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

గాంధీ విగ్రహానికి రూ.70 కోట్లే ఖర్చు

గాంధీ విగ్రహం కట్టడానికి రూ.500 కోట్లు అని దుష్ప్రచారం చేస్తున్నారని, గాంధీ విగ్రహానికి రూ.70 కోట్లే ఖర్చు అవుతుందని సీఎం చెప్పారు. గాంధీ విగ్రహం వద్ద విజ్ఞాన మందిరానికి రూ.100 కోట్లు ఖర్చు చేస్తున్నామని, తెలంగాణ రాష్ట్రంలో మహిళకు రక్షణ మాత్రమే కాదని, అవకాశాలు కూడా ఇస్తామని తెలిపారు. సోషల్ మీడియాలో అవాస్తవాల ప్రచారంపై ఫిర్యాదులకు ఏర్పాట్లు చేస్తామని సీఎం పేర్కొన్నారు.

ఐడియాలజీతో యుద్ధం చేస్తే మంచి ఫలితాలు

ఇటీవల మావోయిస్టుల లొంగుబాటులోనూ మహిళా అధికారులే కీలకమని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. తమ ప్రభుత్వం ఇచ్చే అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలకు చేరాలని ఆకాంక్షించారు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించామని, నిర్వహణ బాధ్యతలూ అప్పగించామని వ్యాఖ్యానించారు. కష్టపడేవారికి గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం ఎంతో ఉందని తెలిపారు. మహిళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత అన్ని సంస్థలపైనా ఉంటుందన్నారు. అదే ఐడియాలజీతో యుద్ధం చేస్తే మంచి ఫలితాలు వస్తాయని వెల్లడించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రజా భవన్ మహిళా జర్నలిస్టులకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంత్రులు పొన్నం ప్రభాకర్, అజరుద్దీన్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎం మాజీ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి , ఐ అండ్ పిఆర్ కమీషనర్ సిహెచ్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ఇది ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ

- ఈ సిటీ అభివృద్ధికి అనేక ప్రాజెక్టులు
- సాధ్యమైన తొందరగా మెట్రో విస్తరణ
- నైట్ ఎకానమీ వచ్చేలా నది పరివాహక ప్రాంతాల అభివృద్ధి
- ప్రపంచంలోనే సుందర నగరం హైదరాబాద్
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి
- బుమ్-రుక్న్- ఉద్దౌలా చెరువు ప్రారంభం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 8: 'ఇది ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ. ఈ సిటీని అభివృద్ధి చేయడానికి అనేక ప్రాజెక్టులు చేపట్టాం. రెండు రోజుల కిందట కొత్వాల్ గూడ ఎకో పార్క్ ను ప్రారంభించుకున్నాం. సాధ్యమైన తొందరగా మెట్రో విస్తరణ పనులను పూర్తి చేస్తాం. మిరాలం ట్యాంక్ బ్రిడ్జి పనులు ప్రారంభమయ్యాయి. పక్కనే హైకోర్టు నూతన భవన నిర్మాణం సాగుతోంది. ఉస్మానియా ఆసుపత్రిని నిర్మిస్తున్నాం.' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులో భాగంగా నది పరివాహక ప్రాంతాన్ని నైట్ ఎకానమీ కొనసాగే విధంగా అభివృద్ధి చేయడం ద్వారా ఈ ప్రాంతంలోని యువకులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ శివరాంపల్లిలో పునరుద్ధరించి అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన బుమ్‌రుక్న్ ఉద్దౌలా చెరువును ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్థానికులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రజలకు అద్భుతమైన సంస్కృతిని అందించడానికి బుమ్‌రుక్న్ ఉద్దౌలా చెరువును పూర్తిస్థాయిలో పునరుద్ధరించామని చెప్పారు. హైదరాబాద్‌లో చెరువులను పునరుద్ధరించిన ప్రాంతాల్లో నైట్ ఎకానమీ కొనసాగే విధంగా స్టాల్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. 'స్థానిక పౌరులకు మంచి వాతావరణం కల్పించాం. ఇక్కడ ఆడబిడ్డలు స్వేచ్ఛగా ఉదయం, సాయంత్రం సమయాల్లో వాకింగ్ చేసుకోవడానికి ఇక్కడ లేక్ పోలీసింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. అలాగే, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి ఈ లేక్స్ వద్ద స్టాల్స్ పెట్టి స్థానికులు పాలు, పండ్లు, కూరగాయలు పరిశుభ్రమైన వాతావరణంలో అమ్ముకోవడానికి వీలు కల్పిస్తాం.' అని అన్నారు. 99 రోజుల 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా హైదరాబాద్‌లో అనేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. 'ఒకప్పుడు హైదరాబాద్ రాక్స్, లేక్స్ తో ప్రపంచంలోనే సుందరమైన నగరంగా ఉండింది. ఈ నగరం మనది. దీన్ని రక్షించుకోవలసిన బాధ్యత కూడా అందరిపైన ఉంది. ఈ మహానగరానికి పూర్వ వైభవం తీసుకురావాలన్న సంకల్పంతో ఆక్రమణలకు గురైన చెరువులు, నాలాలను తొలగించే కార్యక్రమం చేపట్టాం.' అని తెలిపారు. 'ఇది ఓల్డ్ సిటీ కాదు. ఒరిజినల్ సిటీ. ఈ సిటీని అభివృద్ధి చేయడానికి అనేక ప్రాజెక్టులు చేపట్టాం. రెండు రోజుల కిందట కొత్వాల్ గూడ ఎకో పార్క్ ను ప్రారంభించుకున్నాం. సాధ్యమైన తొందరగా మెట్రో విస్తరణ పనులను పూర్తి చేస్తాం. మిరాలం ట్యాంక్ బ్రిడ్జి పనులు ప్రారంభమయ్యాయి. పక్కనే హైకోర్టు నూతన భవన నిర్మాణం సాగుతోంది. ఉస్మానియా ఆసుపత్రిని నిర్మిస్తున్నాం.' అని సీఎం అన్నారు. హైదరాబాద్ అత్యంత పురాతన, ప్రాముఖ్యత కలిగిన నగరం అని సీఎం అన్నారు. 'ఆ ప్రాభవం కోల్పోయే ప్రమాదం ఉంది. దీన్ని ఒక సుందరమైన నగరంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో పనిచేస్తున్నాం. బతుకమ్మ కుంటను అభివృద్ధి చేశాం. ఏడాది కిందట బుమ్‌రుక్న్‌ఉద్‌దౌలా చెరువు ఎలా ఉంది. ఇప్పుడెలా ఉంది. ఈ ఒరిజినల్ సిటీని అభివృద్ధి చేయడానికి వసరమైన నిధులు మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ప్రస్తుతం కొనసాగుతున్న పనులను చూడండి. ఆ పనులను చూసి ప్రభుత్వానికి మద్దతుగా నిలవండి' అని ముఖ్యమంత్రి ముస్లింలకు ఈ సందర్భంగా రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీలు అసదుద్దీన్ ఓవైసీ, అనిల్ కుమార్ యాదవ్ తో పాటు ప్రజా ప్రతినిధులు, ఉన్నధికారులు పాల్గొన్నారు.

సాఫ్ట్ వేర్ ఉద్యోగులు రైతులుగా మారే రోజులు రావాలి

మొదటిపేజీ తరువాయి

కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండల ఆధ్వర్యంలో మెదక్ జిల్లాలోని తునికిలోని డాక్టర్ రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం నూతనంగా నిర్మించిన రైతు వసతి గృహంతోపాటు ''ఫార్మర్స్ వాల్యూ అడిషన్ & ఫుడ్ ప్రాసెసింగ్ ల్యాబొరేటరీ'' కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేవీకే అంతా కలియతిరిగారు. రైతుల అభ్యున్నతి కోసం కేవీకే చేస్తున్న క్రుషిని అడిగి తెలుసుకున్నారు. అక్కడే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బండి సంజయ్ తోపాటు మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఐకార్ డీజీ మంగీలాల్ జాట్, జిల్లా అదనపు కలెక్టర్ నగేశ్, ఏకలవ్య గ్రామాణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బాగయ్య, అధికారులు వినోద్ కుమార్ సింగ్, షేక్ మీరా, తార, సుందరం, వెంకటేశ్వర్లు, రామచంద్రమూర్తి పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ దేశంలో అనేక సంస్థలున్నా... నిజాయితీ, నిబద్ధతతో, కసితో రైతుల కోసం లాభాపేక్ష లేకుండా పనిచేస్తున్న సంస్థ ఏకలవ్య గ్రామీణ ఫౌండేషన్, క్రుషి విజ్ఞాన కేంద్రం. కార్పొరేట్ హాస్టళ్లను మైమరపించేలా హాస్టల్ ను నిర్మించారని అన్నారు. 'ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ పేరుతో రైతులకు శిక్షణ ఇవ్వాలనుకోవడం చాలా సంతోషం. విద్య, ఆరోగ్యం, సేంద్రీయ వ్యవసాయం విషయంలో ఏకలవ్య గ్రామీణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాగయ్య అలుపెరగని క్రుషి చేస్తున్నారు. ఉన్నత విలువలు, దేశ సేవకు కట్టుబడి మాలాంటి ఎందరో కార్యకర్తలను తయారు చేసిన గురువర్యులు ఆయన.' అని అన్నారు. మన తెలంగాణ రైతాంగానికి పీఎం కిసాన్ రుణాలు, ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా ఆదాయం పెరిగే అవకాశాలను విస్తృతం చేశాం. వీటిని వినియోగించుకుంటూ ''రైతును రాజు'' చేసేందుకు క్రుషి చేస్తున్న తునికీ కేవీకే నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందిస్తూ ముున్ముందు రైతులకు మరింత లాభం కలిగేలా చూడాలని కోరుతున్నా. దేశానికే సంతోషంగా కడుపునిండా భిక్ష(అన్నం) పెట్టే స్థాయికి రావాలి' అని ఆయన ఆకాంక్షించారు.

పాలమూరు–రంగారెడ్డి 30 నెలలలో పూర్తి

మొదటిపేజీ తరువాయి

చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల పురోగతిపై ఆదివారం మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి జిల్లా కు చెందిన ప్రజాప్రతినిధులతో కలసి ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నిర్మాణంలో ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించిందని కల్వకుర్తి ప్రాజెక్టుకు 909 కోట్లు, నెట్టెంపాడు కు 252 కోట్లు, భీమా ప్రాజెక్టుకు 200 కోట్లు,కోయిలసాగర్ ప్రాజెక్టుకు 185 కోట్లు కేటాయింపులు జరిగాయాని ఆయన వివరించారు.అదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, పునరావాస పనులకు గాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు భూసేకరణకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ జూన్ 2 నాటికి 5000కోట్లు విడుదల చెయాలని నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు.

రూ.27 వేల కోట్లు ఖర్చు చేసి చుక్కనీరివ్వలేదు

2014లో బి.ఆర్.ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఈ ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురైయ్యయని ఆయన విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లో ఆఫ్‌టేక్ పాయింట్‌ను జూరాల నుంచి శ్రీశైలానికి మార్చడం వల్ల లిఫ్ట్ ఖర్చులు పెరిగి రాష్ట్రానికి నష్టం కలిగిందని అన్నారు. ఇదే తరహాలో కాళేశ్వరం లిఫ్ట్ ఎత్తిపోతల పథకాన్ని తుమ్మిడి హట్టి నుంచి మేడిగడ్డకు మార్చడం తెలంగాణ రైతులకు అన్యాయం జరిగేలా చేసిందని ఆయన పేర్కొన్నారు.రైతులకు వాగ్దానం చేసిన సాగునీటి ప్రయోజనాలను అందించడానికి ఈ ప్రాజెక్టులకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయిస్తుందని తెలిపారు. సాగు ప్రాజెక్టులపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించిన మంత్రి, వారి ఆరోపణలను గోబెల్స్ శైలిలోని అబద్ధ ప్రచారంగా అభివర్ణించారు. పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.35,200 కోట్ల పరిపాలన అనుమతి తీసుకున్నప్పటికీ, సుమారు రూ.27,000 కోట్లు మాత్రమే ఖర్చు చేసి పనులను నిర్లక్ష్యంగా వదిలేసిందని విమర్శించారు.2023 సెప్టెంబర్‌లో ఈ ప్రాజెక్టులో ఒక పంపును కేవలం ఒక గంట మాత్రమే నడిపి, ఒక్క ఎకరానికి కూడా సమర్థంగా నీరు అందించలేకపోయారన్నారు. ప్రస్తుతం సవరించిన అంచనాల ప్రకారం ఈ ప్రాజెక్టు వ్యయం సుమారు రూ.55,000 కోట్లుగా అంచనా వేస్తున్నట్లు తెలిపారు. డిస్ట్రిబ్యూటరీ నెట్‌వర్క్ నిర్మాణ వ్యయం కలిపితే మొత్తం వ్యయం రూ.80,000 కోట్ల వరకు పెరిగే అవకాశం ఉందని చెప్పారు. అయినప్పటికీ ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. 2023 డిసెంబర్ 7 నుంచి ఇప్పటివరకు పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌పై రూ.7161 కోట్లు ఖర్చు చేసినట్లు ఆయన తెలిపారు. ఇందులో ప్రాజెక్టు పనులకు రూ.6718 కోట్లు, భూసేకరణకు రూ.284.71 కోట్లు, పునరావాసానికి రూ.63.65 కోట్లు, ఇతర ఖర్చులకు రూ.94 కోట్లు వినియోగించినట్లు వెల్లడించారు.

జూరాల ప్రాజెక్టులో పూడికతీత పనులు

జూరాల (ప్రియదర్శిని జూరాల) ప్రాజెక్టులో వెంటనే పూడికతీత పనులు ప్రారంభించాలని మంత్రి నీటిపారుదల అధికారులకు సూచించారు. ఈ ప్రాజెక్టు రూపకల్పన సమయంలో దాని స్థూల నిల్వ సామర్థ్యం 11.94 టీఎంసీలుగా ఉండగా, మట్టిపొరలు పేరుకుపోవడం వల్ల ప్రస్తుతం ప్రభావవంతమైన సామర్థ్యం సుమారు 9 టీఎంసీలకు తగ్గిందని తెలిపారు. 1995లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టులో గత మూడు దశాబ్దాలుగా సహజంగా పేరుకుపోయిన మట్టి కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రాజెక్టు నుంచి తవ్వి తీసే ఇసుకను గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రాజెక్టు పనులకు ఉపయోగించే అవకాశాన్ని కూడా పరిశీలించాలని సూచించారు. నీటిపారుదల శాఖా సలహాదారు ఆదిత్యా దాస్ నాథ్, ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీధర్, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, సహాయ కార్యదర్శి కే.శ్రీనివాస్ తో సహా నీటిపారుదల శాఖా ఇంజినీరింగ్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

రాజకీయం

ఇందిరమ్మ రాజ్యంలో మహిళా సంక్షేమానికి పెద్ద పీట

- నేర్పు, ఓర్పు, విజయం మహిళల సొంతం
- పట్టుదలగా పని చేస్తూ మహిళల విజయాలు
- మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- స్వయం సహాయక సంఘం సభ్యులకు 30 రకాల ఆరోగ్య పరీక్షలు
- ప్రారంభించిన మంత్రులు రాజనర్సింహా, సీతక్క

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 8: ప్రజాప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు పెద్దపీట వేస్తున్నామని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు, నేర్పు..ఓర్పు..విజయం..మహిళల సొంతమని .లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలగా పని చేస్తూ మహిళలు విజయాలు సాధిస్తున్నారన్నారని తెలిపారు. ఆదివారం నాడు బంజారాహిల్స్‌లోని కుమురం భీం ఆదివాసి భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాతో కలిసి సీతక్క ఘనంగా నిర్వహించారు.

30 రకాల ఆరోగ్య పరీక్షలు..

అందులో భాగంగా తెలంగాణ డయాగ్నస్టిక్స్ ద్వారా స్వయం సహాయక సంఘం సభ్యులకు 30 రకాల ఆరోగ్య పరీక్షలను ఈ సందర్భంగా మంత్రులు రాజనర్సింహా, సీతక్క ప్రారంభించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ.. సెర్ప్ కుటుంబసభ్యులకు 30 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించే కార్యక్రమాన్ని ప్రారంభించుకున్నామన్నారు. ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాతోపాటు వైద్య ఆరోగ్యశాఖకు ఆమె ధన్యవాదాలు చెప్పారు. మహిళలకంటూ ఒకరోజు ఉండాలని ఐక్యరాజ్యసమితి 1975లో గుర్తించిందని గుర్తు చేశారు. ఇంతకు ముందు ఒక సోషలిస్టు జర్మనీ నాయకురాలు క్లారా జెట్కిన్ మహిళల సమస్యల మీద పోరాటాలు చేశారని వివరించారు. కర్మాగారాల్లో మహిళలకు వేతనాలు స్వల్పంగా ఉండేవన్నారు. కనీసం ఓటు హక్కు కూడా మహిళలకు లేదని చెప్పారు. కానీ మహిళలు పోరాటాలు చేసి తమ హక్కులను సాధించుకున్నారని వివరించారు. అవకాశం ఇస్తే అంతరిక్షంలోకి వెళ్తారని మహిళలు నిరూపించారన్నారు. కుటుంబాలు, పంట పొలాల నుంచి అంతరిక్షం వరకూ అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని పేర్కొన్నారు. పంట పొలాల్లో 80 శాతం పని మహిళలే చేస్తారని గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ రాజ్యంలో మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నామని తెలిపారు. కోటి మంది మహిళలు కోటీశ్వరులను చేయాలని సంకల్పంతో పని చేస్తున్నామన్నారు. వినూత్న వ్యాపారాలతో ఆర్థికంగా ఎదుగుతున్న మహిళా సంఘాలను ఈ రోజు సన్మానించుకున్నామని చెప్పారు. వారు తెలంగాణ మహిళా సమాజానికి ఆదర్శప్రాయులని తెలిపారు. మహిళలు అందరి గురించి ఆలోచిస్తారు.. కానీ తమ గురించి ఆలోచించే సమయం వారికి దొరకదన్నారు. అందుకే మహిళలకు ఆరోగ్యంగా పని చేసే శక్తి ఉండేందుకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డితోపాటు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఆడ పిల్లలు ఉన్నారని గుర్తు చేశారు. అందుకే వారికి ఆడవారి ఇబ్బందులు తెలుసునన్నారు. కాబట్టి మనకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయిస్తున్నారని పేర్కొన్నారు. మహిళా సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. లోన్ బీమాతోపాటు ప్రమాద బీమాతో వారికి భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాల ద్వారా లోన్‌లు ఇప్పించి పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. హైటెక్ సిటీలో రూ .వందల కోట్ల విలువైన మార్కెట్‌ను మహిళా సంఘాలకు అప్పగించామని గుర్తు చేశారు. సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ నాయకత్వంలో మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదుగుతున్నాయని వివరించారు. ఇప్ప పువ్వు లడ్డూలు మొదలుకొని రైస్ మిల్లుల నిర్వహణ వరకు, ఆర్టీసీ అద్దె బస్సులు, సోలార్ ప్లాంట్లకు మహిళలు ఓనర్లు అవుతున్నారని మంత్రి సీతక్క సంతోషం వ్యక్తం చేశారు. బస్ స్టేషన్లు, రద్దీ ప్రాంతాల్లో శిశువులకు పాలిచ్చే గదుల ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందుకు సంబంధించిన గదుల నమూనాను మంత్రులు సీతక్క, దామోదర ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్ పర్సన్ బండారు శోభారాణితో పాల్గొన్నారు.

గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతో సీఎం భేటీ

ప్రతిపక్షం, హైదరాబాద్, మార్చి 8 : మహారాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించబోతున్న తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డితో కలిసి లోక్‌భవన్‌లో జిష్ణు దేవ్ వర్మతో భేటీ అయ్యారు. గవర్నర్‌తో దాదాపు రెండేళ్ల పాటు తెలంగాణతో ఏర్పడిన అనుబంధం, రాష్ట్రానికి అందించిన సేవలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఈశాన్య రాష్ట్రాలతో తెలంగాణకు మధ్య కళలు, సంస్కృతి, సాంకేతిక పరిజ్ఞానం, క్రీడలు, ఆవిష్కరణల వంటి అంశాల్లో నిరంతర సహకారం, పరస్పర అవగాహన కోసం "తెలంగాణ - నార్త్ ఈస్ట్ ఇండియా కనెక్ట్" పేరుతో జిష్ణు దేవ్ వర్మ చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు.

మహిళల హాకీ ప్రపంచ కప్ క్వాలిఫైయర్స్ టోర్నమెంట్‌ప్రారంభం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 8: హైదరాబాద్ గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియంలో ప్రతిష్ఠాత్మక మహిళల హాకీ ప్రపంచ కప్ 2026 క్వాలిఫైయర్స్ టోర్నమెంట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. భారత్, ఉరుగ్వే మధ్య మ్యాచ్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. వచ్చే ఆగస్టులో బెల్జియం, నెదర్లాండ్స్‌లో జరగనున్న ప్రపంచ హాకీ కప్‌కోసం క్వాలిఫైయర్స్ మ్యాచ్‌లు హైదరాబాద్‌లో జరుగుతున్నాయి. 8వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరగనున్న ఈ క్వాలిఫైయింగ్ మ్యాచ్‌ల టోర్నమెంట్ లో 8 దేశాలు పాల్గొంటున్నాయి. గ్రూప్-ఏలో ఆస్ట్రియా, ఇంగ్లండ్, ఇటలీ, కొరియా దేశాలు, గ్రూప్-బీలో ఇండియా, స్కాట్లాండ్, ఉరుగ్వే, వేల్స్ జట్లు పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, తెలంగాణ ప్రభుత్వ క్రీడా సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

మండలి భవనాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 8: చారిత్రక శాసనసభ ప్రాంగణంలో పునరుద్ధరించిన శాసనమండలి భవనాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి శాసనమండలి భవనాన్ని ప్రారంభించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహా, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, మహమ్మద్ అజహరుద్దీన్ పాటు ప్రభుత్వ సలహాదారులు, పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. మండలిలో ముఖ్యమంత్రి కార్యాలయంలో రేవంత్ రెడ్డి పూజ నిర్వహించారు.

ఆహార భద్రతకు ఆధారం
మహిళా రైతులే

- మహిళా శిశు సంక్షేమ మంత్రి సీతక్క

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 8: అన్నంతో కడుపు నింపడమే కాదు.. ఆహార భద్రతకు ఆధార స్తంభాలు మహిళా రైతులే అని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. విత్తనం నాటడం నుంచి పంట కోత వరకు చెమటోడ్చి, శ్రమించేది ఆడబిడ్డలేనని తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన మహిళా రైతు మేళాలో మంత్రి పాల్గొని మాట్లాడారు. వారి శ్రమకు తగిన గౌరవం, గుర్తింపు ఇవ్వడం, వారిని మరింత ముందుకు తీసుకెళ్లడం అందరి బాధ్యత అని అన్నారు. 2026ను ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ మహిళా రైతు సంవత్సరంగా ప్రకటించడం వారికి గౌరవాన్ని మరింత ఇనుమడింపజేసిందని తెలిపారు. మహిళా రైతుల శక్తిని చూసినప్పుడు ఎంతో గర్వంగా అనిపించిందని ఈ సందర్భంగా మంత్రి అన్నారు.

మహిళలతోనే సమాజాభివృద్ధి

- మున్సిపల్ చైర్ పర్సన్ సోనియా దర్శన్

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 8 : మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ సమాజ అభివృద్ధికి ముందుండాలని మున్సిపల్ చైర్ పర్సన్ సోనియా దర్శన్ పేర్కొన్నారు. మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ హమ్మద్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ సోనియా దర్శన్ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు .నూతన మున్సిపల్ కౌన్సిలర్లను శాలువాలతో మున్సిపల్ కమిషనర్ జాకీర్ హమ్మద్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మహిళలే సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. మున్సిపల్ ఆవరణలో తొలిసారిగా మహిళా దినోత్సవాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు.నేటి తరం మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తూ తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ దంపతులను కలిసిన మంత్రి సీతక్క

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 8: బదిలీపై వెళ్తున్న తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ దంపతులను రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. మహారాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన సందర్భంగా గవర్నర్‌కు మంత్రి సీతక్క శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ దంపతుల యోగక్షేమాలను మంత్రి సీతక్క అడిగి తెలుసుకున్నారు. ములుగు జిల్లా పట్ల గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రత్యేక అభిమానం చూపించారని మంత్రి సీతక్క గుర్తుచేశారు. గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మూడు సార్లు ములుగు నియోజకవర్గంలో పర్యటించడం మాత్రమే కాకుండా, కొండపర్తి గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తాను దత్తత తీసుకున్న గ్రామాల్లో మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం గవర్నర్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారని మంత్రి గుర్తు చేశారు. ముఖ్యంగా కారంపొడి మిల్లు, పసుపు మిల్లు ఏర్పాటు చేయడంతో పాటు గ్రామంలో పలు మౌలిక వసతులను కల్పించి మహిళలకు ఉపాధి అవకాశాలను పెంచారని, అందుకు ములుగు ప్రజలు రుణపడి ఉంటారని సీతక్క చెప్పారు. ములుగు నియోజకవర్గ ప్రజలు గవర్నర్ గారిని ఎంతో అభిమానంతో గుర్తుంచుకుంటారని, ఆయనను ఎంతో మిస్ అవుతారని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన అనుభవాలను మంత్రి సీతక్క వివరించగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ భావోద్వేగానికి లోనయ్యారు. దాదాపు అరగంటకు పైగా మంత్రి సీతక్కతో గవర్నర్ దంపతులు ఆసక్తిగా మాట్లాడి పలు విషయాలు పంచుకున్నారు. అయితే ఈ సందర్భంగా మంత్రి సీతక్క సేవలను గవర్నర్ ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆమెను "వెరీ ఆక్టివ్ లేడీ" అంటూ అభినందించారు. ఇదే విధంగా ప్రజలకు సేవ చేసే కార్యక్రమాలను కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క గవర్నర్‌కు సమ్మక్క-సారలమ్మ జాతర జ్ఞాపికను అందజేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గవర్నర్ సతీమణికి తెలంగాణ సంప్రదాయ చీరను బహూకరించారు.

ఫ్యూచర్ రెడీ పోలీసింగ్ రోల్ మోడల్‌గా తెలంగాణ

- భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేందుకు 'ట్రిపుల్ టీ' వ్యూహం
- నేరాల జరగకముందే అడ్డుకునేలా 'ప్రెడిక్టివ్ పోలీసింగ్'కు ప్రాధాన్యం
- 'తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్ 2026'లో మంత్రి శ్రీధర్ బాబు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 8: 'ఫ్యూచర్ రెడీ' పోలీసింగ్‌లో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా నిలపాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పోలీసింగ్‌లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు 'ట్రిపుల్ టీ'(టెక్నాలజీ, ట్రస్ట్, టాలెంట్) వ్యూహంతో ముందుకెళ్తున్నామన్నారు. ఆదివారం ఆర్బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో పోలీస్ ఉన్నతాధికారులకు 'తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్ 2026' పేరిట నిర్వహించిన ప్రత్యేక కార్యశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... ఒకప్పుడు పోలీసింగ్ అంటే కేవలం శాంతి భద్రతల పరిరక్షణ మాత్రమే, ఇప్పుడు డేటా సెక్యూరిటీ, డిజిటల్ ట్రస్ట్ గా రూపాంతరం చెందిందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా క్రైం కూడా భౌతిక సరిహద్దులను దాటి డిజిటల్ రూపంలోకి విస్తరించిందన్నారు. డీప్‌ఫేక్ వీడియోలు, వాయిస్ క్లోనింగ్, ఆటోమేటెడ్ ఫిషింగ్ స్కామ్‌లు పోలీసులకు పెను సవాల్‌గా మారాయన్నారు. ప్రస్తుతం నేరగాళ్లకు ఆయుధాలతో పనిలేదని, స్మార్ట్ ఫోన్, డేటా, డిజిటల్ ఐడెంటిటీస్ తో నేరాలకు పాల్పడుతున్నారన్నారు. ఒక్క 2024లో దేశవ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు రూ.22,845 కోట్లు కొల్లగొట్టారని, అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఇది 206 శాతం ఎక్కువన్నారు. సైబర్ బాధితుల్లో నిరక్షరాస్యుల కంటే అక్షరాస్యులే అధికంగా ఉంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలో ప్రొఫెషనలిజం, ఆపరేషనల్ రెడీనెస్, లీడర్‌షిప్, ఇన్నోవేషన్, కొలాబరేషన్ , ఎథిక్స్ తో కూడిన ఫ్యూచర్ రెడీ పోలీసింగ్ ఆవశ్యకమన్నారు. ఇప్పటికే టెక్నాలజీ ఎనేబుల్డ్ పోలీసింగ్ లో తెలంగాణ ముందు వరుసలో ఉందన్నారు. రాబోయే రోజుల్లో డేటా అనలిటిక్స్, ఏఐ లాంటి కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ సాయంతో నేరాల జరగకముందే అడ్డుకునే 'ప్రెడిక్టివ్ పోలీసింగ్'కు పెద్దపీట వేస్తామన్నారు. 'తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్య సాధనలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. ప్రజల నమ్మకాన్ని చూరగొన్నప్పుడే అసలైన పోలీసింగ్ సాధ్యమవుతుందన్నారు. నక్సలిజంపై పోరాటంలో అసువులు బాసిన పోలీస్ అమరవీరులను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు స్మరించుకున్నారు. వారి త్యాగం వృథా కాలేదన్నారు. కార్యక్రమంలో డీజీపీ శివధర్ రెడ్డి, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్త్, రిటైర్డ్ డీజీపీలు హెచ్ జే దొర, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- కొలన్ హన్మంత్ రెడ్డి

ప్రతిపక్షం, కుత్బుల్లాపూర్, మార్చి 8 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో గొప్ప వరమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలను హన్మంత్ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 284వ డివిజన్ గణేష్ నగర్ కాలనీకి చెందిన బోలె సుబ్బారావు కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం లేకపోవడంతో స్థానిక మాజీ కార్పొరేటర్ కే.ఎం. గౌరీష్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని సంప్రదించారు. వెంటనే స్పందించిన కొలన్ హన్మంత్ రెడ్డి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో శస్త్రచికిత్స కోసం రూ.2,50,000 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధిని మంజూరు చేయించారు. అనంతరం మంజూరైన పత్రాలను ఆదివారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు వైద్య ఖర్చుల వల్ల ఇబ్బందులు పడకుండా ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు మహిళా సాధికారత అన్న పదం పలికే అర్హత లేదు. మహిళలకు ఎన్నికల ముందు మీరిచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదు. అయినా అన్నీ చేసేసినట్లు మహిళా దినోత్సవం సందర్భంగా డ్రామా మొదలెట్టారు. మీ ఎమ్మెల్యేలు, టీటీడీ చైర్మన్ అత్యాచార ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించారు. పిల్లల్ని, మహిళల్ని మీరు పెంచి పోషిస్తున్న కామాంధులు ఎలా చిదిమేస్తున్నారో చూసి సిగ్గనిపించడం లేదా.

\- వైసీపీ అధినేత జగన్

యాది

వెండి తెర వెన్నెల రాణి దేవికా రాణి

రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

రూప లావణ్యం, అద్భుత నటనా చాతుర్యం, అద్వితీయ అందం కలగలిపిన నాటి మేటి సినీ నటి దేవికా రాణి. ఆడపిల్లలు సినిమాలలో నటించడం తప్పుగా భావించే నాటి రోజులలోనే సినిమాలలో నటించిన భారతీయ తెర ప్రథమ మహిళ ఆమె. ఆమె తొలి సినిమా నటి, నిర్మాత, స్టూడియో అధినేత్రి. సినిమా నటన, నిర్మాణం, డిజైనింగ్, మేకప్ మొదలయిన శాఖలలో శిక్షణ పొందిన తొలి భారతీయ మహిళ. నాటి రోజుల్లో లండన్ వెళ్ళి ఆర్కిటెక్చర్, టెక్స్టైల్స్, డెకరేషన్ ఇంజనీరింగ్లో శిక్షణ పొందారామె. దేవికా రాణి (మార్చి 30, 1908 మార్చి 9, 1994) సుప్రసిద్ధ సినీ నటి. పద్మశ్రీ, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుల గ్రహీత. నటిగా, నిర్మాత గా భారతీయ చిత్ర పరిశ్రమలో ఆమె చేసిన పాత్ర మరువలేనిది. స్వాతంత్ర్యానికి ముందు మహిళా మార్గదర్శకుల్లో ఆమె ఒకరు. భారతీయ తెర ప్రథమ మహిళ (ఫస్ట్ లేడీ ఆఫ్ ఇండియన్ సినిమా)గా గుర్తింపు పొందిన నటి. వెండి తెర మీద తొలి ముద్దు సన్నివేశం లో నటించిన భారతీయ నటి దేవికా రాణియే. దేవికా రాణి తన భర్త హిమాన్షు రాయ్‌తో కలిసి 1943లో బాంబే టాకీస్‌ను స్థాపించారు. ఇది భారత దేశంలోని మొట్ట మొదటి సుసంప న్నమైన స్టూడియోలలో ఒకటి. 1933లో భారతీయ సినిమాలో మొట్ట మొదటి ఆంగ్ల భాషా టాకీగా తీసిన 'కర్మ' సినిమాలో హిమాంశును ఆమె నాలుగు నిమిషాలు ముద్దు పెట్టుకుని సంచలనం సృష్టించిన తొలి తరం సంచలన డేరింగ్ నేటి. ఈమె 1908 మార్చి 30వ తేదీన నాటి మద్రాసు ప్రెసిడెన్సీ, నేటి ఆంధ్రప్రదేశ్ లోని విశాఖ పట్టణంలో జన్మించారు. ఆమె తల్లిదండ్రులు లీలా చౌధురి, కల్నల్ మన్మథ్నాథ్ చౌధురిలు. వీరు నోబెల్ బహుమతి గ్రహీత, గురుదేవ్ రవీంద్రునికి దగ్గరి బంధువులు, విద్యావంతులకు నిలయమైన సంపన్న జమీందారీ కుటుంబం వీరిది. భారతదేశం లోను, మద్రాసు ప్రెసిడెన్సీలోను తొలి సర్జన్ జనరల్ కల్నల్ చౌధురి. 8 ఏళ్ళ వరకు బాల్యపు విద్యాభ్యాసాన్ని శాంతినికేతన్లో సాగించారు. 9 ఏళ్ళ వయస్సులోనే శాంతి నికేతన్లో విద్యాభ్యాసం తర్వాత ఉపకార వేతనం మీద లండన్ వెళ్ళి అక్కడ రాయల్ అకాడమీ ఆఫ్ డ్రమటిక్ ఆర్ట్స్, మ్యూజిక్లో సంగీతం, నటన లో శిక్షణ పొందారు. 1920 నాటికి పాఠశాల విద్యను పూర్తి చేశారు. ఆమె తన బాల్యంలో ఎక్కువ భాగం లండన్‌లో గడిపారు, అక్కడ ఆమె నటన, సంగీతం, వాస్తుశిల్పం అభ్యసించారు.రాయల్ అకాడమీ ఆఫ్ డ్రైమెటిక్ ఆర్ట్స్, రాయల్ అకాడమీ ఆఫ్ మ్యూజిక్ లో చేరారు. వివిధ కళలకు సంబంధించిన పరిజ్ఞానాన్ని, నైపుణ్యతను సంపాదించారు. ఇవే తరువాత కాలంలో సినిమా రంగంలోని వివిధ రంగాలలో ఈమెని అత్యున్నత స్థాయిలో నిలిపాయి. ఆమె టెక్స్‌టైల్ డిజైనర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించగా, హిమాన్షు రాయ్, న్యాయవాదిగా మారిన చలనచిత్ర నిర్మాతను కలుసుకున్న తర్వాత ఆమె జీవితం ఒక మలుపు తిరిగింది. జర్మనీలో ప్రసిద్ధ సినీ నిర్మాతగా పేరు పొందిన హిమాంశు రాయ్‌తో పరిచయం ఏర్పడి తర్వాత అది ప్రేమగా మారి 1929లో పెళ్ళి చేసు కున్నారు. ఆమె చిత్ర నిర్మాణం విషయంలో నేర్చుకోవడానికి బెర్లిన్‌కు వెళ్ళి, బెర్లిన్ లోని యు.ఎఫ్.ఎ. స్టూడియోలో మేక ప్, కాస్ట్యూమ్ డిజైనింగ్ మొదలైన విభాగాల్లో శిక్షణ పొందారు. స్వదేశానికి తిరిగివచ్చి స్వంతంగా "కర్మ" (1933) అనే ఆంగ్ల చిత్రాన్ని నిర్మించారు. దేవికారాణి నాయికగా, హిమాంశు రాయ్ నాయకునిగా దీనిని హిందీలోకి అనువదించి విడుదల చేసారు కూడా. 1934లో "బాంబే టాకీస్" అనే సంస్థను స్థాపించి ఎందరో ఔత్సా హిక కళాకారుల్ని చేర్చుకొని వివిధ రంగాల్లో శిక్షణ నిచ్చారు. దేవికా రాణి కూడా భారతీయ సినిమాకు మధుబాల, ముంతాజ్, దిలీప్ కుమార్ వంటి అమూల్యమైన రత్నాలను అందించిన నిర్మాత. బాంబే టాకీస్ తీసిన చిత్రాలలో దేవికా రాణి, అశోక్ కుమార్ ల జంట హిట్ పెయిర్ గా పేరు పొందారు. వారు మొదటగా జీవన్ నయ్యా (1936) లో కలిసి నటించారు. అశోక్ కుమార్, దేవికా రాణి తరచుగా దేశభక్తి జన్మభూమి (1936), ప్రేమకథ ఇజ్జత్ (1937) మరియు పౌరాణిక సావిత్రి (1937) వంటి చిత్రాలలో కలస. నటించిన జంట. అంజాన్ (1941) వారు కలిసి తెరపై వచ్చిన చివరి చిత్రం. ఆమె నటించిన 16 చిత్రాలలోని చాలా పాత్రలు సంఘర్షణాత్మక మైనవి. అనేక మహిళా కేంద్రీకృత చిత్రాలను చేశారు. బాంబే టాకీస్ ద్వారా అచూన్ కన్యలో నటించగా, ఈ చిత్రం బ్రాహ్మణ అబ్బాయి మరియు అంటరాని అమ్మాయి ప్రేమ కథ ఆధారంగా మరియు సమాజంలోని కుల వ్యవస్థను ధైర్యంగా సవాలు చేసింది. సమాజ వివక్షతకు గురయ్యే హరిజన యువతిగా అచూత్ కన్య (1936) లో, తల్లి కాలేని గృహిణిగా నిర్మల (1939) లో, అనాథగా దుర్గ (1939), తిరగ బడిన మహిళగా సావిత్రి (1937) లో విధివంచితు రాలైన బ్రాహ్మణ యువతిగా జీవన్ ప్రభాత్ (1937) లో ఆమె నటన అనితర సాధ్యమైనది. 1940 మే 19లో హిమాంశు రాయ్ హఠాన్మరణం పొందడంతో బాంబే టాకీస్ నిర్వహణ బాధ్యత ఆమె చేతిలో పడింది. తర్వాత తీసిన బసంత్, కిస్మత్, అంజానా మొద లైన చిత్రాలు ఆర్థికంగా లాభాలు తెచ్చి పెట్టాయి. తర్వాత బాంబే టాకీస్ స్టుడియోను దర్శించడానికి వచ్చిన సుప్రసిద్ధ రష్యన్ చిత్రకారుడు స్వెతస్లోవ్ రోరిక్ తో పరిచయం ఏర్పడి అది ప్రేమగా మారి 1945లో వివాహానికి దారి తీసింది. తర్వాత ఆమె సినీరంగానికి దూరమయ్యారు. భారతీయ సినిమాకు పితామహు డుగా భావించబడే దాదాసా హెబ్ ఫాల్కే శతజయంతి సందర్భంగా 1969 లో దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని భారత ప్రభుత్వం ఏర్పాటు చేయగా, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు నెలకొల్పిన తొలిసారి 1969లో చలనచిత్ర పరిశ్రమకు చేసిన సేవలకు గుర్తింపుగా దేవికా రాణి దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును అందుకున్న మొదటి గ్రహీతగా నిలిచారు. ఆ తర్వాత కాలంలో పృధ్వీ రాజ్ కపూర్, రూబీ మేయర్స్, బి.యన్ సర్కార్ లాంటి వాళ్ళకు ఈ అవార్డ్ అందచేశారు. ఆమె సినిమా రంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభు త్వం 1958లో పద్మశ్రీ పురస్కారం ఇచ్చింది. చివరి రోజుల్లో బెంగుళూరులో గడుపు తూ 1994 మార్చి 9 తేదీన 85 ఏళ్ల వయసులో ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.

(మార్చి 9...
దేవికా రాణి వర్ధంతి)

పరిచయం

తీవ్రమైన భావోద్వేగాల రచనల బెంగాలీ చేవ్రాలు:మైత్రేయి దేవి

డా.టి.రాధాకృష్ణమాచార్యులు
9849305871

బెంగాలీ సాహిత్యంలో అనేక మంది సాహిత్యవేత్తలు సుసంపన్నమైన సృజన చేశారు. సంప్రదాయ,ఆధునిక సాహిత్యంలోనూ వివిధ ప్రక్రియల్లో రచన చేశారు.శరత్, జీబనానంద్ దాస్,మల్లికా సేన్ గుప్తా ఇంకా అనేక సృజనకారులు ఉన్నారు. అందులో తీవ్రమైన భావోద్వేగ రచనలకు ప్రసిద్ధి చెందిన బెంగాలీ కవయిత్రి,నవలా రచయిత్రి మైత్రేయి దేవి ఒకరు.ఆమె తన 16 ఏళ్ళ వయసులో తన తొలి కవితా సంకలనాన్ని ప్రచురించింది. ఆమె సాహిత్య అకాడమీ అవార్డ్ అందుకున్న నవల 'ఇది చనిపోదు'(నా హన్యతే)రచనతో బాగా ప్రసిద్ధి చెందిన రవీంద్రనాథ్ ఠాగూర్ శిష్యురాలుగా గుర్తింపు.సెప్టెంబర్ 10,1914న చిట్టగాంగ్,బెంగాల్ ప్రెసిడెన్సీలో జన్మించిన మైత్రేయి దేవి జనవరి 29,1989న 74 సంవత్సరాల వయసులో కలకత్తా,పశ్చిమ బెంగాల్లో మరణించారు. ఆమె తల్లిదండ్రులు హిమానీ మాధురీ రాయ్,సురేంద్రనాథ్ గుప్తా.ప్రసిద్ధ తత్వవేత్త సురేంద్రనాథ్ దాస్ గుప్తా కుమార్తె,విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ అనుచరురాలుగా పేరుగల మైత్రేయి దేవి కలకత్తాలో సెయింట్ జాన్స్ డయోసిస్ గర్ల్స్ హైస్కూల్ లో చదువుకున్నది. కలకత్తా విశ్వవిద్యాలయంలోని జోగమయి కాలేజీ నుండి డిగ్రీ పొందింది.కాలేజీ రోజుల్లోనే మొదలైన ఆమె సృజనాత్మక రచనలో 'ఉదారత' తొలి కవితా సంకలనం రవీంద్రనాథ్ ఠాగూర్ ముందు మాటతో 1930లో వచ్చింది.ఆ రోజుల్లోనే తమ ఇంట్లోనే ఉంటున్న రొమేనియన్ మేధావి మిర్సియా ఎలియాడ్ తో పరిచయం కాస్త సన్నిహితంగా మారింది.అది గమనించిన తల్లిదండ్రులు ఎలియాడ్ ను మందలించి ఇంటి నుండి పంపించారు. తర్వాత డా.మన్మోహన్ సింగ్ ను తన 20 యేండ్ల వయసులో మైత్రేయి దేవి వివాహమాడారు. వారికి ఇద్దరు పిల్లలు. మైత్రేయి దేవి అందుకున్న అవార్డులలో ప్రధానమైనది తన నవల"ఇది చచ్చిపోదు"'(నా హన్యాతే')కు 1976లో సాహిత్య అకాడమీ అవార్డ్ ఓ రికార్డ్.ఆమె రచనల ప్రచురణలలో 1943లో ఠాగూర్ బై ఫైర్సైడ్, 1973లో రవీంద్రనాథ్‌ది మ్యాన్ బిహైండ్ హిజ్ పోయెట్రీ, 1974లో ఇట్ డజ్ నాట్ డై ఎ రొమాన్స్ మరింకా రవీంద్రనాథ్ ఇంట్లో, ప్రపంచంలో "మంగ్పువా వద్ద రవీంద్రనాథ్" (మంగ్పుతే రవీంద్రనాథ్) కనిపిస్తాయి. 1938, 1939 కాలంలో రవీంద్రనాథ్ ఠాగూర్ ను కాలింపాంగ్ సమీపంలోని ముంగ్పూలోని తన భర్త ఇంట్లో ఉండమని ఆమె ఆహ్వానించింది. ఇది తరువాత రవీంద్ర మ్యూజియంగా మారింది. ఆమె రచనలలో 'రవీంద్రనాథ్ ఠాగూర్ అగ్ని పక్కన' (ఠాగూర్ బై ది ఫైర్ సైడ్),(మోంగ్పుటే రవీంద్రనాథ్), రచనలో ఆమెతో అతను సందర్శించిన రికార్డు నమోదయి ఉంది. ఇక మైత్రేయి సంఘ సేవ కూడా చేశారు. ఆమె 1964 లో కౌన్సిల్ ఫర్ ది ప్రమోషన్ ఆఫ్ కమ్యూనల్ హార్మోనీ'(సంస్థ మత సామరస్యప్రచార సంస్థను) స్థాపించింది. అఖిల భారత మహిళా సమన్వయ మండలి ఉపాధ్యక్షురాలుగాపనిచేశారు. మైత్రేయి దేవి అనాథాశ్రమాలను కూడా స్థాపించారు. ఇక 1972 లో మిర్సియా ఎలియేడ్ బెంగాల్ నైట్స్ అనే నవలను రాశారు.అందులో వారి మధ్య లైంగిక సంబంధాన్ని వివరిస్తుంది. లాస్ ఏంజిల్స్ టైమ్స్ కోసం రాస్తున్న రిచర్డ్ ఎడెర్ ప్రకారం, "మిర్సియా ఎలియేడ్ ఉద్వేగభరితమైన కానీ పరిమితమైన ఆలింగనాలను విలాసవంతమైన లైంగిక సంబంధంగా రాశాడు. అంతేకాదు మైత్రేయి రాత్రిపూట పడకగది సందర్శనలను ఒక రకమైన మార్మికంగా రెచ్చగొట్టే హిందూ ప్రేమ దేవతగా చూపించాడు" అంటారు. అంటే ఇదొక మాయా కల్పనగా ఉన్నదని వెలుగుపరచడమే. 1972 చివరలో, ఆమె ఆదిత్య మారిచి (సూర్య కిరణాలు) అనే కవితా సంకలనాన్ని ప్రచురించింది. ఇది ఎలియాడే కల్పితను సూచిస్తుంది.దీని టొరంటో రివ్యూ కోసం రాసిన గిను కమానీ సారాంశం "ఆమె తన యవ్వన పాత అభిరుచులతో వ్యవహరించినప్పుడు ఆమె అనుభవించిన అలజడిని ప్రతిబింబిస్తుంది".అంటే 42 సంవత్సరాల వయస్సు యవ్వన ప్రేమ, అలాగే 58 సంవత్సరాల వయస్సు యువ గీతాలాపన అలజడి ప్రతిధ్వనులుగా వివరిస్తుంది. అయితే ఎలియాడ్ ప్రొఫెసర్ గా పనిచేసే చికాగో విశ్వవిద్యాలయానికి ఠాగూర్ పై ఉపన్యాసాలు ఇవ్వడానికి మైథిలి దేవి వెళ్లింది. అక్కడ ఎలియాడ్ ను పలుమార్లు కలిసింది.ఆ తరువాతే ఆమె 1974 లో తన నవల ఇది చచ్చిపోదు'(నా హన్యాటే),(ఇట్ డస్ నాట్ డై: ఎ రొమాన్స్) ను విడుదల చేసింది.దీనిపై వచ్చిన రివ్యూలలో కొన్ని ఇలా...చికాగో ట్రిబ్యూన్ కోసం ఒక సమీక్షలో నినా మెహతా ఇలా రాశారు, "ఎలియాడ్ రాసిన నవలలోని మైత్రేయి దేవి సెక్స్ దృశ్యాలు, మరి కొన్ని వివరాలను సత్యదూరంగా తోసిపుచ్చింది. అలైన్ ఒప్పుకొనే స్వరం సత్యాన్ని సూచిస్తుందని,అతని జ్ఞాపకశక్తి తప్పుడు వాస్తవాలను సూచిస్తుందని పేర్కొంది అని అంటూనే "అయినప్పటికీ విడ్డూరంగా, బహుశా ఆవేశంగా కూడా, ఆమె సృష్టించిన ఫాంటసీకి పెద్ద విశ్వసనీయతను ఇవ్వడంతోనే ఆమె ఎలియాడ్ కల్పనకు గట్టి సమాధానం ఇస్తుంది."అంటారు. 1980 లలో, బెంగాల్ నైట్స్ అనుసరణ ఒక చిత్రంగా అభివృద్ధి చేయబడింది, ఇందులో హ్యూ గ్రాంట్, సుప్రియా పాఠక్ నటించారు, దేవి మొదట మైత్రేయి పాత్ర పేరును గాయత్రిగా మార్చాలని పట్టుబట్టింది.ఇంకా న్యాయపరంగా చిక్కులతో 1996 వరకూ ఈ సినిమా ఇండియాలో కానీ, అమెరికాలో కానీ విడుదల కాలేదు.నిజ జీవితంలోని సంఘటనలు రచయిత స్వతహాగా చిత్రించడంలో నాణ్యత నిజాయితీ,నిజం కనపడుతుంది. కానీ మరో వ్యక్తి లేదా రచయిత సాధారణంగా జీవితాన్ని రాసేప్పుడు ఏ ఉద్దేశ్యాలకు,లక్ష్యాలకూ తావులేకుండా సృజించాలి.కాని దానికి భిన్నంగా రాగద్వేషాలతో రచిస్తే అవతలి మనసు గాయాయం విబేధిస్తుంది.అది సహజం.వివాదానికి కేంద్ర బిందువు అవుతుతుంది.ఆ కోవలోనే 'బెంగాల్ నైట్స్','ఇట్ నెవర్ డై,ఏ రొమాన్స్' రచనలున్నట్లుంది. ఏదేమైనా ఒక కవిలోని, రచయిత్రిలోని భావోద్వేగాల తీవ్రత,సృజన చిత్రణల కౌశలం, పరిణితి, ప్రమాణత, స్వీయ రచన గొప్పగా రాసిన మైత్రేయి దేవి నిజ జీవితం, సాహిత్య జీవితం చారిత్రాత్మిక సదృశ్యం.

కవిత

మంజుల అనే నేను

గాయాల్ని గుండెల్లో దాచుకుని
గర్వంగా నవ్వడం నేర్చుకున్నాను!
పడిపోతూ కూడా నిలబడటం నేర్చుకున్నాను!

నిశ్శబ్దంగా కనిపించినా
నిర్ణయాల్లో గర్జించే శక్తిని నేను!
నేను మహిళను మాత్రమే కాదు
మార్పుకు మొదటి అడుగు నేను!

నన్ను ఆపాలని ప్రయత్నించిన చేతులు
ఇప్పుడు నా విజయానికి చప్పట్లు కొడుతున్నాయి!
నన్ను ఆపాలని వచ్చిన చీకట్లు
ఇప్పుడు నా వెలుగుకే దారి చూపించాయి!

కన్నీరు పొంగిన ప్రతి క్షణం
నా గుండెల్లో విప్లవం మేల్కొంటుంది!
నన్ను ఆపాలని వచ్చిన ప్రతి మాట
ఇప్పుడు నా విజయ గీతంగా మారుతోంది!

నేను వంటింటి పొగ కాదు
నిరాశలో ఉన్న మహిళా హృదయాలకు ఆశ నింపి
వెలుగుజ్యోతిని వెలిగించాను!

నన్ను అబల అని అన్న వారందరికీ
సహనాన్ని ఆయుధంగా మార్చుకొని
నాయకురాలిగా దారులు చూపించాను!

ఇల్లు నుంచి దేశం వరకు
ప్రతి రంగంలో వెలుగునిచ్చే
ప్రతి మగువకు నా హృదయపూర్వక
వందనాలు తెలుపుతూ...
అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

మంజుల పత్తిపాటి (కవయిత్రి).
మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్
యాదాద్రి భువనగిరి జిల్లా
9347042218

సందర్భం

ఓ మహిళ ఇంకా మేలుకో!!

ఈ సృష్టికి ప్రతి రూపం స్త్రీ
ఆమె ఆది శక్తి అందుకే స్త్రీ మూర్తిని తల్లిగా పూజించే గొప్ప సంస్కృతికి సంప్రదాయాలకు మన పవిత్ర భారతదేశం నిదర్శనం!
ఈ సృష్టిలో అతి గొప్ప శక్తిస్త్రీ

అందమైన బృందావనం నిర్మించాడు భగవంతుడు
అందులో ఆడించుచున్నాడు నేడు చూడు స్త్రీ లేనిది సృష్టి లేదు
స్త్రీ అంటే చులకన ఎందుకు
అమ్మ అనే మాట మరవకు
చెట్టు పుట్టలు పవిత్రంగా కొలిచే
తులసి అమ్మ అని పిలుచుకునే
గంగా యమునా సరస్వతి
పవిత్ర నదులు ప్రదర్శించే స్త్రీ
పేర్లతోనే కాదా!!
ప్రేమ ఆప్యాయత పంచే చెల్లెలు
ఆనందాన్ని ఇచ్చే భార్య స్త్రీలే కదా
అజ్ఞానం వదిలిపెట్టి జ్ఞాన జ్యోతిని వెలిగించి పవిత్ర భారత దేశ సంస్కృతిని కాపాడుకోవాలి స్త్రీలు
అక్షరం నేర్చుకోవాలి అజ్ఞానం వదులుకోవాలి అన్ని రంగాలలో స్త్రీలు ముందుండాలి అభివృద్ధి అప్పుడు
చూడాలి ఝాన్సీ లక్ష్మీబాయి లా
రాణి రుద్రమదేవి చూడరా
రాజ్యాలు ఏలిన జాతీయ రత్నాలు
స్త్రీ ఎక్కడ గౌరవింపబడుతుందో
దేవతలు అక్కడ ఉంటారు
దైవత్వాన్ని జోడించుకుని
ఆ దైవత్వాన్ని స్త్రీ మూర్తిగా గౌరవించి
ఆ స్త్రీని తల్లిగా చెల్లెలుగా అన్ని రూపంలో అమ్మతనముగా
ఈ ఆవనికి వెలుగునిచ్చే
ఆ కమ్మని పిలుపు ఈ జగతికి వెలుగు!!
ఈ ప్రజాస్వామ్య దేశంలో
ఈ పవిత్ర భారత దేశంలో పల్లె నుండి పట్నం వరకు
నిత్యం జరుగుతున్న స్త్రీలపై
సంఘటనలు చూస్తుంటే
న్యాయం కోసం పోరాటం స్త్రీలు చేస్తుంటే ధర్మం కోసం పోరాటం
నిత్య సంఘటనలు చూస్తుంటే కన్నీళ్లు వస్తున్నాయి చూడు
ఓ భారత వనిత ఇంకా మేలుకో ధర్మం కోసం పోరాడు ఆ ధర్మం నిన్ను కాపాడుతుంది!!

కొమురవెల్లి నరసింహులు
తెలుగు బుక్ ఆఫ్ రికార్డు గ్రహీత
గ్రామం మర్పడగ

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం



సర్వైకల్ క్యాన్సర్ నివారణకు హెచ్‌పివి వ్యాక్సిన్ దోహదం

- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి , మార్చి 8: ప్రపంచవ్యాప్తంగా మహిళల్లో పెద్ద ఆరోగ్య సమస్యగా ఉన్న సర్వైకల్ క్యాన్సర్ నివారణకు హెచ్‌పివి వ్యాక్సిన్ ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. ఆదివారం సంగారెడ్డి జనరల్ ఆసుపత్రి లో హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 15 సంవత్సరాల లోపు బాలికలకు జనరల్ ఆసుపత్రి ,ఏరియా ఆసుపత్రుల్లో హెచ్‌పివి వ్యాక్సిన్‌ను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు.జిల్లాలో 14నుండి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల సుమారు 12,500 మంది బాలికలను వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గుర్తించినట్లు తెలిపారు. ఈ బాలికలందరికీ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక, 99 రోజుల కార్యక్రమం కాలంలో ఉచితంగా వ్యాక్సినేషన్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. బాలికల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రుల సమక్షంలోనే ఈ వ్యాక్సిన్ అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. క్యాన్సర్ రహిత సమాజ నిర్మాణం కోసం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చేపడుతున్న ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వసంతరావు ,వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి

ప్రతిపక్షం, గుండాల, మార్చి 8: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీఐటీయూ, తెలంగాణ వ్యవసాయ గ్రామీణ కార్మికుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు.ఆదివారం గుండాల మండల కేంద్రంలో సీఐటీయూ తెలంగాణ వ్యవసాయ గ్రామీణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో గ్యాస్ సిలిండర్‌తో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ గ్రామీణ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం పేదలపై భారాలు మోపుతోందని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు కోట్ల రూపాయల రాయితీలు ఇస్తూ పేద ప్రజలపై భారాన్ని పెంచడం సిగ్గుచేటని అన్నారు. పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.ఏ. నబి, తెలంగాణ వ్యవసాయ గ్రామీణ కార్మికుల సంఘం మండల నాయకులు తోలెం గోపి, ఊకె వెంకటేశ్వర్లు, జిల్లా సహాయ కార్యదర్శి వజ్జ సుశీల, జిల్లా కమిటీ సభ్యులు పాయం సారమ్మ, నజ్మా, ఈశ్వరి, విజయలక్ష్మి, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 8: మండలంలోని అప్డాపూర్ గ్రామంలో పరిసరాల పరిశుభ్రతతో పాటు తడి-పొడి చెత్త పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మద్యపాగ కృష్ణ ఆధ్వర్యంలో గల్లీలు, మెయిన్ రోడ్లు ల్లో శుభ్రత కార్యక్రమం చేపట్టి దోమల నివారణ చర్యలు తీసుకున్నారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా వేయడం వల్ల గ్రామంలో పరిశుభ్రత మెరుగుపడుతుందని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కారోబార్ ఆర్. గోపాలచారి, వార్డు సభ్యులు, గ్రామ యువకులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి

- సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే.రాజయ్య

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 8: పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే రాజయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం పటాన్ చెరు పట్టణంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అమెరికా,ఇజ్రాయిల్, ఇరాన్ పైన యుద్ధం కొనసాగిస్తుండడం మూలంగా చమురు ధరలు పెరిగాయని అన్నారు. వెంటనే అమెరికా యుధోన్మాదాన్ని ఆపాలని, ప్రపంచ శాంతి వర్ధిల్లాలని, చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ప్రస్తుతం 905 రూపాయలు ఉన్న గ్యాస్ కేంద్ర ప్రభుత్వం 60 రూపాయలు పెంచడం మూలంగా 965 రూపాయలకు చేరిందని చెప్పారు. కమర్షియల్ గ్యాస్ పైన 115 రూపాయలు అదనంగా పెంచడం మూలంగా సామాన్య, మధ్యతరగతి ప్రజానికం పైన తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుందని వాపోయారు. అమెరికా, ఇజ్రాయిల్ కలిసి ఇరాన్ పైన దాడి చేస్తున్న యుద్ధం విషయంలో, మన భారత ప్రధానమంత్రి మోడీ ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. ఇరాన్ యుద్ధం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను మరింత తీవ్రతనం చేస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ ఏరియా కమిటీ కార్యదర్శి బి. నాగేశ్వరరావు, ఏరియా కమిటీ సభ్యులు ఎం.డీ. వాజీద్ అలీ, పి. పాండురంగారెడ్డి, బి. పెంటయ్య, జార్జ్, రామకృష్ణ, నారాయణ ఇతరులు పాల్గొన్నారు.

పెన్షన్ పెంపు కోసం

13 న ఇందిరా పార్కు వద్ద నిరాహార దీక్షలు

- వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు పి. మేరీ, జయలక్ష్మి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 8 : వికలాంగుల పెన్షన్తో పాటు చేయూత పెన్షన్స్ పెంచాలని డిమాండ్ చేస్తూ మార్చి 13 న హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద వికలాంగుల సామూహిక నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నామని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్.పి.ఆర్.డి) రాష్ట్ర కమిటీ సభ్యులు పి.మేరీ, జయలక్ష్మి తెలిపారు. ఆదివారం వారు పటాన్ చెరులో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 27 నెలలు అవుతున్న పెన్షన్స్ పెంచడం లేదన్నారు. 2023 డిసెంబర్ నుండే పెన్షన్స్ పెంచుతామని చెప్పి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక హామీని అమలు చేయకుండా వికలాంగులను మోసం చేశారని వాపోయారు. బడ్జెట్లో నిధులు కేటాయించకుండా ప్రభుత్వం వికలాంగుల పట్ల చిన్న చూపు చూస్తుందని మండిపడ్డారు. కొత్త పెన్షన్స్ మంజూరు కోసం 26 నెలల నుండి చేయూత లబ్ధిదారులు ఎదురుచూస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని,అసెంబ్లీ సమావేశాల్లో పెన్షన్ పెంచుతు ప్రభుత్వం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్, బడ్జెట్ పెంపు కోసం ఫిబ్రవరి 13 న ఇందిరా పార్క్ వద్ద జరిగే నిరాహార దీక్షలో జిల్లాలోని వికలాంగులంతా పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ప్రతిపక్షం, గుండాల, మార్చి 8: గుండాల మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం వాసవి క్లబ్ గుండాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల సేవలు, సమాజంలో వారి పాత్రను గుర్తిస్తూ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలను శాలువాలతో సన్మానించి వారి సేవలను కొనియాడారు. సమాజ అభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని, కుటుంబం నుండి సమాజం వరకు అన్ని రంగాల్లో మహిళలు ముందంజలో ఉన్నారని నాయకులు తెలిపారు. మహిళల సాధికారతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు మానాల వెంకటేశ్వర్లు, వాసవి క్లబ్ అధ్యక్షులు మానాల శ్రావణ్ కుమార్, వాసవి క్లబ్ కోశాధికారి తవిడి శెట్టి రాంబాబు, తుడుం దెబ్బ మండల అధ్యక్షులు గోవింద నరసింహారావు, పూనెం శ్రీను, లింగగూడెం సర్పంచ్ చింతా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కొమురవెల్లి మల్లన్న ఆలయంలో భక్తుల రద్దీ

- ఎనిమిదవ ఆదివారానికి భారీగా తరలివచ్చిన భక్తులు.

ప్రతిపక్షం, కొమురవెల్లి, మార్చి 8 : కొమురవెల్లి శ్రీ మల్లికార్జునస్వామి జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ ఆదివారంకు భక్తులు భారీగా తరలి రావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి . దీంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయి ఆలయ ప్రాంగణాలు మొత్తం మల్లన్న నామస్మరణతో మారు మోగాయి. శ్రీ మల్లికార్జునస్వామి వారి దర్శనానికి సుమారు 40 వేల భక్తులు తరలివచ్చినట్లు మొక్కులు చెల్లించుకున్నారని ఆలయ అధికారులు తెలిపారు. శనివారం సాయత్రం నుంచే మల్లన్న స్వామి క్షేత్రానికి భక్తులు చేరుకున్నారు. ఆలయ గదులు, ప్రయివేటు వసతి గదులలో బస చేసిన భక్తులు ఆదివారం వేకువజాము నుంచే మల్లన్న స్వామికి తలనీలాలు సమర్పించిన అనంతరం మల్లన్న పుష్కరిణిలో స్నానాలు చేసి స్వామి వారి దర్శనానికి వెళ్ళారు. కొంతభక్తులు స్వామికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు, పట్నాలు వేసి భోనాలు సమర్పించగా మరికొంత మంది భక్తులు ఓడిబియ్యం పోసి, కేశఖండన, గంగిరేణు చెట్టువద్ద పట్నాలు వేసి, ముడుపులు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. మరికొంత భక్తులు మల్లన్న స్వామికి మట్టికుండలలో బోనం తయారు చేసి మల్లన్న స్వామితో పాటు మల్లన్న కొండపైన ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి, పోచమ్మ తల్లులకి సమర్పించి మొక్కలు అప్పగించారు. అనంతరం రాతి గీరల వద్ద ప్రదక్షణలు, కోడెల స్థంభం వద్ద కోడెలు కట్టి పూజలు చేశారు. స్వామి దర్శనానికి సుమారు 4 గంటల సమయం పట్టింది. భక్తులకు కావల్సిన సౌకర్యాలను ఈవో కృష్ణప్రసాద్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ గంగం నర్సింహ్మా రెడ్డి, ఏఈఓలు బుద్ధి శ్రీనివాస్, రావుల సుదర్శన్, సూపరిండెంట్ నీల చంద్రశేఖర్, ధర్మకర్తలు సార్ల లింగం బొచ్చు ఎల్లయ్య, రావికంటి సత్యనారాయణ, వెలగల మల్లేశంతో పాటు ఆలయ సిబ్బంది భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

కన్న తండ్రే కాలయముడు!

- ముగ్గురు చిన్నారులను చెరువులో తోసి చంపిన తండ్రి
- అదృశ్యమయ్యారని ఫిర్యాదు
- పిల్లలను పోషించలేక ఈ దుశ్చర్య

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, మార్చ్ 8 : కన్న పిల్లల బాగోగులు చూసుకుని వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన తండ్రే వారి పాలిట కాలయముడయ్యాడు. అభం శుభం తెలియని ముగ్గురు చిన్నారులు చాక్లెట్లు కొనిస్తానని నమ్మించిన తండ్రి మాట విని ఆటోలో వెళ్లడమే వారికి నిండు నూరేళ్ళు నిండిపోయాయి. ఎక్కడికి తీసుకు వెళుతున్నాడు ఏమి చేస్తాడో తెలియని వారు తండ్రి మాట విని వెంట వెళ్లగా ముగ్గురు పిల్లలను కన్న ప్రేమను పక్కన పెట్టి కర్కషంగా చెరువులో తోసేసి హత్య చేసి ఏమీ తెలియనట్టుగా వచ్చి భార్యతో ముగ్గురు పిల్లలు కనిపించడం లేదంటూ అమాయకంగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల కదలికలు ఆరా తీయడంతో పాటు పోలీసుల స్టైల్లో తండ్రిని విచారించడంతో అసలు విషయం బయటపడింది. తండ్రి ముగ్గురు పిల్లలను ఆటోలో తీసుకువెళ్లి చెరువులో తోసేసి హత్య చేసినట్టుగా పోలీసులు ధృవీకరించి ముగ్గురు పిల్లల శవాలను బయటకు తీశారు.

ఆర్థిక ఇబ్బందులతో....

హత్యకు గురైన ముగ్గురు పిల్లల తండ్రి ఆటో డ్రైవర్గా పని చేస్తుండగా.. తల్లి పలువురి ఇళ్లలో పాచి పనులు చేస్తుందేది.. అయితే వీరికి అప్పులు లేకున్నప్పటికీ ముగ్గురు పిల్లలతో కలిపి కుటుంబ పోషణ తల్లిదండ్రులకు భారంగా మారింది. ఈ క్రమంలో వీరికి ముగ్గురు కూడా ఆడపిల్లలే కావడంతో ఆ తండ్రి కఠిన నిర్ణయం తీసుకున్నాడు. పిల్లలను పోషించే స్థోమత లేని తండ్రి పిల్లలను ఎలాగైనా వదిలించుకోవాలనుకున్నాడు. శనివారం తన పిల్లలను ఆటోలో తీసుకుని కామారెడ్డి పెద్ద చెరువు వద్దకు తీసుకెళ్లి వారిని చెరువులో తోసి హత్య చేసి ఏమీ తెలియనట్టుగా తన పిల్లలు కనిపించడం లేదని నటిస్తూ భార్యతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అనుమానం వచ్చి తండ్రిని తమ స్టైల్ లో విచారణ చేయగా అసలు విషయం బయటపడింది. కామారెడ్డి పట్టణంలోని ఆర్బీ నగర్ కాలనీకి చెందిన సబీనా, ఇస్మాయిల్ దంపతులకు సిపాత్ (8), అయాత్(7), మరియం (5) అనే ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. తండ్రి ఇస్మాయిల్ ఆటో డ్రైవర్గా పని చేస్తుండగా తల్లి సబీనా పలు ఇళ్లలో పాచి పనులు చేసేది. అయితే వీరి సంపాదన అంతంత మాత్రమే కావడంతో కుటుంబ పోషణ భారం ఎక్కువ అవుతుందని భావించిన తండ్రి ముగ్గురు కూతుళ్లను తమ నుంచి అడ్డు తొలగించుకోవాలని భావించాడు. పథకం ప్రకారం ముగ్గురు పిల్లలను ఆటోలో తీసుకువెళ్లి కిరాణా షాపులో తినడానికి కావాల్సిన చాకోలెట్స్ కొనిచ్చి కామారెడ్డి చెరువు వద్దకు వెళ్లినట్లుగా సమాచారం. అనుకున్నట్టుగానే ఇస్మాయిల్ ముగ్గురు పిల్లలను చెరువులోకి తోసేశాడు.

ఇంటికి వచ్చి..ఏమీ తెలియనట్టు..

ముగ్గురు పిల్లలను తీసుకువెళ్లిన తండ్రి ఇస్మాయిల్ పిల్లలతో పాటు అతను కూడా ఇంటికి రాకపోయేసరికి తల్లి సబీనా ఇస్మాయిల్కు ఫోన్ చేసింది. దీంతో కిరాణా షాప్ లో పిల్లలకు కావలసిన సామాను కొనివ్వగా వారు ఇంటికి వెళ్లారని, తాను ఆటో తీసుకుని పాత బస్టాండ్ వెళ్లిపోయానని నమ్మించాడు. సబీనాకు అనుమానం రాకుండా ఉండేందుకు ఇంటికి వచ్చిన ఇస్మాయిల్ పిల్లలను చుట్టు పక్కల వెతికారు. చివరికి పిల్లలు కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రత్యేక బృందాలతో పోలీసుల గాలింపు

ముగ్గురు పిల్లలు మిస్సింగ్ అయ్యారని ఫిర్యాదు స్వీకరించిన కామారెడ్డి డీఎస్పీ చైతన్య రెడ్డి మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా విచారణ చేపట్టారు. సీసీ కెమెరాలో పిల్లలు ఆటో ఎక్కినట్లుగా పోలీసులు గుర్తించారు. తర్వాత ఎక్కడికి తీసుకు వెళ్ళింది సీసీ కెమెరాల్లో నమోదు కాకపోవడంతో పోలీసులు తండ్రిని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో తండ్రి ఇస్మాయిల్ పిల్లలను చెరువులో తోసి హత్య చేసినట్లుగా ఒప్పుకున్నాడు. దాంతో పోలీసులు చెరువులో మృతదేహాల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి 10.30 వరకు అయాత్, మరియం మృతదేహాలు లభ్యం కాగా సిపాత్ మృతదేహం లభ్యం కాకపోవడంతో అర్ధరాత్రి వరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి 12 గంటల తర్వాత సిపాత్ మృతదేహం కూడా లభ్యమైంది. దీంతో ముగ్గురు మృతదేహాలు లభ్యమయ్యాయి.

ఇంటి నుంచి వెళ్లిన చిన్నారులు విగత జీవులుగా లభ్యం

ఉదయం తండ్రితో కలిసి ఆటోలో కిరాణా షాపుకు అని ఇంటి నుంచి వెళ్లిన ముగ్గురు చిన్నారులు అర్ధరాత్రి వరకు మిగతా జీవులుగా చెరువులో లభ్యం కావడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలను కామారెడ్డి జీజీహెచ్ పోస్టుమార్టం నిమిత్తం తరలించగా అక్కడికి భారీ ఎత్తున కుటుంబ సభ్యులు, బంధువులు, ప్రజలు చేరుకొని విలపించారు. ఆసుపత్రి ఆవరణంలో వారి రోధనలు మిన్నంటాయి. పవిత్ర రంజాన్ మాసంలో ఈ సంఘటన జరగడం అందరినీ కలచి వేసింది.

సమాజ అభివృద్ధిలో మహిళలే కీలకం

- మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు. రాధికా భూపతి రాజు.

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చ్ 8: మహిళలతోనే సమాజ అభివృద్ధి అని మెదక్ మున్సిపల్ చైర్పర్సన్ కానుగు రాధిక భూపతి రాజ్ అన్నారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి చైర్ పర్సన్ కానుగు రాధికను, మహిళా కౌన్సిలర్లను,మున్సిపల్ మహిళా సిబ్బందిని శాలువాతో సన్మానించి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం చైర్ పర్సన్ కానుగు రాధిక మాట్లాడుతూ.. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా సమాజంలో మహిళలు అనేక విజయాలు సాధిస్తున్నారని, మహిళా సాధికారత లేకుండా ఏది సాధ్యం కాదని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు.మహిళలే సమాజ అభివృద్ధిలో కీలకమని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు విద్య, ఉపాధి, రాజకీయాలు, క్రీడలు, మరియు వివిధ రంగాలలో అత్యంత ప్రతిభ కనబరుస్తున్నారని,మహిళల్లో ఏదైనా సాధించాలనే తపన చాలా ఉంటుందని వివరించారు.మహిళ పారిశుద్ధ సిబ్బందిని అభినందిస్తూ వారు ఉదయాన్నే నిద్ర లేచి పట్టణంలోని అన్ని వీధులను శుభ్రపరచడం జరుగుతుందని పారిశుధ్య మహిళ సిబ్బంది పనులలో అంతరాయం ఏర్పడితే ప్రజలకు చాలా కష్టమని, వారు చేసే పని చాలా గొప్పదని, పారిశుద్ధ మహిళా సిబ్బందికి అభినందనలు తెలిపారు. మహిళల గురించి స్వయంగా రాసిన ఒక కవిత్వాన్ని చదివి వినిపించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి,మహిళా కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి భారత్, -చైనా కట్టుబడి ఉండాలి. ఇరు దేశాలు శత్రువులుగా కాకుండా భాగస్వాములుగా, ముప్పగా కాకుండా అవకాశంగా చూడాలి. గతేడాది మోదీ, జిన్‌పింగ్ మీటింగ్ తర్వాత వాణిజ్యంలో రికార్డులు నమోదయ్యాయి. సరిహద్దుల్లో శాంతిని కాపాడుకుంటూ అభివృద్ధిపై దృష్టిసారించాలి. ఘర్షణలు హానికరం.

- చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ

ప్రాంతీయం

ప్రతి ఇంటి బాధ్యత మహిళ హక్కు

- జిల్లా కలెక్టర్ హైమవతి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 8: అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని సిద్దిపేట కోమటి చెరువు పై సిద్దిపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ హైమావతి సిద్దిపేట మున్సిపల్ చైర్పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఇంటి బాధ్యత మహిళ హక్కుని ,దానిని సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. పుట్టింటిలో మహిళ మొదటి దైవం తల్లి అని అన్నారు.దేశంలో దిన దిన ఓల్డేజ్ హోమ్ ల సంఖ్య క్రమ క్రమంగా పెరుగుతూన్నాయాని వాటిని తగ్గించే విధంగా అందరూ సహకరించాలని,మెట్టింటిలో అత్తమామ లను తల్లిదండ్రుల వలే చూసుకువాల్సిన బాధ్యత ప్రతి మహిళపై ఉంటుందన్నారు.మహిళలు ప్రతిరోజు మహిళా దినోత్సవం వలే ఆనందంగా గడపాలని సుభిక్షంగా ఉండాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న అంబిటస్ పాఠశాల విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్, మహిళా కౌన్సిలర్లు బింగి బాల్ లక్ష్మి,బందారం శ్రీలత, అంబిటస్ పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ రెడ్డి, మెప్మా అధికారి సాయి కృష్ణ, పట్టణ ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

నృసింహ నామస్మరణతో మార్మోగిన నాచ'గిరులు'

- నాచగిరిలో ఆధ్యాత్మిక వార్షిక బ్రహ్మోత్సవాలకు శ్రీకారం
- 33 కోట్ల దేవతలకు కొలువైన గోమాతను పూజించి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ
- హాజరైన గురు మదనానంద పీఠాధిపతి

ప్రతిపక్షం, గజ్వేల్ (వర్గల్) మార్చ్ 8: తెలంగాణ జిల్లాల్లో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలోని నాచగిరి శ్రీ లక్ష్మీనృసింహ క్షేత్ర గిరి ప్రదక్షిణ పూర్వజన్మ సుకృతమని, లోక కళ్యాణార్థం నిర్వహిస్తున్న ఈ మహత్కార్యంలో పాల్గొన్న భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతి దక్కుతుందని శ్రీ గురు మదనానంద పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామీజీ ఉద్బోధించారు. ఆదివారం నాచగిరి క్షేత్రంలో 'గిరి' ప్రదక్షిణ కార్యక్రమాన్ని చైర్మన్ రవీందర్ గుప్త ఆధ్వర్యంలో ప్రారంభించగా, ఆలయ అధికారి బెల్లంకొండ రంగాచారి, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, విజయ మోహన్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం స్వామీజీ భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేస్తూ శ్రీ నారసింహుడు నడయాడిన ఈ ప్రాంతం ఎంతో పవిత్రమైనవని, దర్శిస్తే సర్వపాపాలు తొలగి ముక్తికి మార్గం దక్కుతుందని అన్నారు. స్వామివారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం పురస్కరించుకొని వైకుంఠ ద్వారం నుండి గిరి ప్రదక్షిణ చేయడం పుణ్యకార్యమని, చక్కటి ఫలితాలిస్తుందని, భగవన్నామ స్మరణతో మానసిక ప్రశాంతత దక్కుతుందని.దీనిని దృష్టిలో పెట్టుకొని ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం దిగ్విజయంగా జరగాలని స్వామీజీ ఆకాంక్షించారు. సనాతన ధర్మ పరిరక్షణ, ఆధ్యాత్మిక చింతన, ధార్మిక భావన తదితర గుర్తు చేస్తుండగా, ఈ సంస్కృతి వారసత్వాన్ని ప్రతి ఒక్కరూ స్వీకరించాలని కోరారు. పరమేశ్వరుడి కృప, భగవంతునిపై భక్తి, సేవాభావం, మనో నిగ్రహం, దాతృత్వం, ధర్మబద్ధమైన జీవనం తదితర మానవుడిని సన్మార్గంలోనడిపించనుండగా, పుణ్యక్షేత్రాలు, పురాతన ఆలయాలు, గోసంపద తదితర రక్షించుకునే బాధ్యతను మర్చిపోవద్దని వివరించారు. ఈ కార్యక్రమాల్లో ట్రస్టు బోర్డు సభ్యులు ఉషశ్రీ రాజశేఖర శర్మ, చందా నాగరాజు గుప్త, జగ్గయ్యగారి శేఖర్ గుప్త, శ్రీనివాస్, రుద్ర శ్రీహరి, గాలి కిష్టయ్య, సురేందర్ రెడ్డి, కర్రె పద్మ వెంకటేష్, సర్పంచ్లు సారిక యాదగిరి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం 33 కోట్ల దేవతలకు కొలువైన గోమాతను పూజించి వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య స్వామీజీ నాచగిరి వార్షిక బ్రహ్మోత్సవాలకు జ్యోతి ప్రజ్వలనతో అంకురార్పణ చేశారు. ఈ ఉత్సవాల్లో అశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి పాటుపడుతున్న కాంగ్రెస్

- సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తుఇమామ్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 8: మహిళల సంక్షేమమే ధ్యేయంగా మహిళల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాటుపడుతున్నారు. అని సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తుఇమామ్ అన్నారు. సిద్ధి పేటలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పురపాలక సంఘం లో పనులు చేస్తున్న పారిశుధ్య మహిళా సిబ్బందికి సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తుఇమామ్ చీరలు అందజేసి శాలువతోసన్మానించి అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిద్ధి పేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తుఇమామ్ మాట్లాడుతూ...ఈ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం అని అన్నారు. ఎన్నికల్లో ప్రజలకు మహిళలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్నాం అని అన్నారు. ఆరు గ్యారంటీలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం 200 యూనిట్లకు ఉచిత విద్యుత్ 500 రూపాయలకే సబ్సిడీ కింద గ్యాస్ సిలిండర్ కోట్లాది రూపాయలు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నాం అని అన్నారు. దేశంలో మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారు అని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మహిళలకు పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని మరో 10 సంవత్సరాలు ఆశీర్వదించాలి అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు చూసి ఇతర రాష్ట్రంలో అమలు చేస్తున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్యాదారి మధు గయాజుద్దీన్ హర్ష హుస్సేన్ అజ్మత్ విజయ డానియల్ మున్నా సంతోషి ముదసిర్ పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో ముందుకు సాగాలి

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చి 8: సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షులు జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ దేశబోయిని నర్సింహులు ఆధ్వర్యంలో ఆదివారం సత్యసాయి దేవాలయం ఆవరణంలో ఘనంగా నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందనా రవీందర్,మున్సిపల్ వైస్ చైర్మన్ కళ్యాణ్ చార్ట్ పద్మాబాయి నరసింహారావు తో కలిసి పాల్గొని మాట్లాడుతూ ధైర్యం,సంకల్పం, స్ఫూర్తికి ప్రతిరూపం మహిళ అని అలాంటి మహిళలు చైతన్యవంతులై అన్నిరంగాలలో రానించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్, వైస్ చైర్మన్, భరోసా కోఆర్డినేటర్ వినోద, ఉమెన్ పోలీస్ కానిస్టేబుల్ వీణ , అంగన్వాడీ శిరీష, ఆశావర్కర్ పద్మాలకు, శ్రీలత లకు శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో కళ్యాణ్కర్ నర్సింగ్ రావు, శివకుమార్, సాత్విక్, కుమార్, భాను తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ నాయకత్వంలో పల్లెల అభివృద్ధికి కృషి

- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 8: చిన్నకోడూరు మండలం చౌడారం గ్రామంలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహాత్మ గాంధీ జీవితం దేశానికి గొప్ప సందేశమని అన్నారు. గాంధీజీ చూపిన అహింసా, సత్యాగ్రహ మార్గంలోనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని తెలిపారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం స్ఫూర్తితో కేసీఆర్ నాయకత్వంలో పల్లెల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి జరిగిందన్నారు.గత పదేళ్లలో గ్రామాల అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపట్టామని, తాగునీటి కోసం మిషన్ భగీరథ, రైతులకు మద్దతుగా రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు.పదేళ్ల బి ఆర్ ఎస్ ప్రభుత్వ కాలంలో చౌడారం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా నిలిపామని తెలిపారు. గ్రామ ప్రజలు ఐక్యతతో ముందుకు సాగి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామ అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన అన్నారు.

గీతా అగర్వాల్ కు రాష్ట్రస్థాయి ఉత్తమ మహిళా ఉద్యోగి అవార్డు

ప్రతిపక్షం,మెదక్ టౌన్,మార్చ్ 8: మెదక్ జిల్లా రామాయంపేట రేంజ్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ గీత అగర్వాల్ అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. అటవీ శాఖలో ఆమె అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా రాష్ట్రస్థాయి ఉత్తమ మహిళా ఉద్యోగి అవార్డుకు ఎంపికయ్యారు. దూలపల్లిలోని ఫారెస్ట్ అకాడమీలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ అదనపు డీజీపీ స్వాతి లక్రా, హెడ్ ఆఫ్ ఫోర్స్ సువర్ణ చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారాన్ని స్వీకరించారు.అటవీ సంరక్షణ, వన్యప్రాణుల పరిరక్షణ, ఆటవీ శాఖ అభివృద్ధిలో గీతా అగర్వాల్ చూపిన అంకితభావాన్ని గుర్తించి అధికారులు ఆమెను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. విధి నిర్వహణలో ఆమె ప్రదర్శిస్తున్న నిబద్ధత ఇతర ఉద్యోగులకు ఆదర్శంగా నిలుస్తుందని ఈ సందర్భంగా ఉన్నతాధికారులు కొనియాడారు.గీతా అగర్వాల్ గత ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మెదక్ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా జిల్లా స్థాయి ఉత్తమ ఉద్యోగి అవార్డును కూడా అందుకున్నారు. ఇప్పుడు రాష్ట్రస్థాయిలో ప్రతిష్టాత్మక అవార్డును దక్కించుకోవడంపై అటవీ శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది, స్థానికులు ఆమెకు అభినందనలు తెలిపారు.

సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠ

ప్రతిపక్షం, దుబ్బాక, మార్చి 8: దుబ్బాక మండలం రామక్కపేట గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి సహిత లక్ష్మణ స్వామి , ఆంజనేయ స్వామివార్ల విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యలు హాజరై స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ,చైర్మన్ బక్కి వెంకటయ్యలకు అభిషేకం నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం స్వామివారి కండువాతో వారిని సన్మానించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గం ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు, భక్తులు తది తరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హెచ్ పీవి టీకా మీ బిడ్డ భవిష్యత్తుకు రక్షణ కవచం

ప్రతిపక్షం, సిద్దిపేట, మార్చి8: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రిలో హెచ్పీవీ టీకా కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ హైమావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 6 కేంద్రాల్లో ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. జిల్లాలో ఉన్న 10147 మంది 14 సంవత్సరాల బాలికలందరూ హెచ్ పి వి వ్యాక్సిన్ తీసుకొనే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కలిగించి ప్రతి ఒక్క బాలిక తీసుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ నివారించవచ్చని ఈ టీకా ఒక డోస్ తీసుకుంటే సరిపోతుందని ప్రజలు ఎలాంటి అపోహలకు గురికా వద్దని తెలియజేశారు . ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ , డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ శ్రీనివాస్, ఎన్సిడి ప్రోగ్రాం ఆఫీసర్ వినోద్ బాబ్జి ,ప్రోగ్రామ్ ఆఫీసర్ సి హెచ్ ఐ డాక్టర్ దీప్తి ప్రియాంక ,ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్ గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ జ్యోతి, డాక్టర్ సదానందం డాక్టర్ శ్రావణి , డాక్టర్ సురేష్ బాబు, జనరల్ ఆసుపత్రి వైద్యులు , నాసరుపురా పట్టణ ఆరోగ్య కేంద్ర సిబ్బంది, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ ,ఎన్సిడి కోఆర్డినేటర్స్ రాజేందర్ వెంకటరమణ పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

- మహిళా పోలీసులకు ఘనంగా సన్మానం

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్,మార్చి 8: కౌడిపల్లి పోలీస్ స్టేషన్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెదక్ జిల్లా అదనపు ఎస్పీ. మహేందర్ హాజరై కేక్ కట్ చేసి మహిళా పోలీస్ సిబ్బందితో కలిసి మహిళా దినోత్సవ వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. పోలీస్ శాఖలో మహిళా సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు భద్రత కల్పించడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. కఠిన పరిస్థితుల్లో కూడా మహిళా పోలీసులు ధైర్యంగా విధులు నిర్వర్తిస్తూ శాఖకు మంచి పేరు తీసుకొస్తున్నారని ప్రశంసించారు. అలాగే మహిళా సిబ్బంది విధుల్లో ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు కుటుంబ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తున్న మహిళా సిబ్బందిని అభినందించారు.ఈ కార్యక్రమంలో తూప్రాన్ డియస్పి నరేందర్ గౌడ్, నర్సాపూర్ సీఐ జాన్ రెడ్డి, కౌడిపల్లి ఎస్సై అమర్, పోలీస్ సిబ్బంది, మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు .

పూలే, అంబేద్కర్ చూపిన దారిలోనే మహిళలకు విముక్తి

- డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండ స్వామి

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చి 8: మహిళ జాతికి సాధికారత అందాలంటే మానసిక విప్లవం తో పాటు పూలే_ అంబేడ్కర్ మార్గంలో ప్రయాణించటం ద్వారానే స్త్రీ జాతికి విముక్తి లభిస్తుందని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి అన్నారు. ఆదివారం నాడు గజ్వేల్ మండల పరిదిలో డిబిఎఫ్ అధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఎస్సీ,ఎస్టీ,ఓబిసి శ్రామిక మహిళలపై కుల వివక్షత,అణచివేత అత్యాచారాలు, శ్రమ దొపిడిలను ప్రతికటిద్దామనే సదస్సు నందు దాసరి ఏగొండ స్వామి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చి 8న జరుపుకునే అంతర్జాతీయ మహిళా దినోత్సవం, లింగ సమానత్వం కోసం వాదిస్తూనే మహిళలు సాధించిన సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మరియు రాజకీయ విజయాలను గుర్తించే ప్రపంచ దినోత్సవమన్నారు. లింగ సమానత్వం కొసం,పక్షపాత దొరణి, మూస దొరణి లకు వ్యతిరేకంగా కొట్లాడం కొసం, మహిళల హక్కుల కొసం ఐక్యరాజ్యసమితి సైతం మహిళ దినోత్సవాన్ని గుర్తించడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా మహిళ దినోత్సవాన్ని జరుపుకుంటున్నమన్నారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు,మహిళలు లలిత, కిష్టవ్వ, కళ్యాణి, రేణుక, సత్తవ్వ, హరిబాబు, మల్లేశం, రవి, స్వామి,లక్ష్మి, పొశవ్వ, రాజవ్వ తదితరులు పాల్గొన్నారు. ఇదే సందర్భంలో బిఆర్ఎస్ పార్టీ 10 వ వార్డ్(పల్లెపాడు) కౌన్సిలర్ కోట బాపురాజు మాట్లాడుతూ సృష్టికి మూలమైన మహిళ ఒకప్పుడు వంటింటికే పరిమితమైన నేడు ప్రపంచానికే స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు. విద్య, వైద్యం, రాజకీయాలు, వ్యాపారం, క్రీడలు తదితర అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా రాణిస్తూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. కుటుంబ బాధ్యతలను సమర్థంగా నిర్వహించడంతో పాటు ఉద్యోగులుగా, ప్రజాప్రతినిధులుగా మహిళలు తమ సత్తాను చాటుతున్నారని తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు విశ్రాంతి లేకుండా కుటుంబాన్ని చూసుకుంటూనే సమాజానికి సేవలు అందిస్తున్న మహిళల త్యాగస్ఫూర్తి ప్రశంసనీయమని కొనియాడారు. ఎక్కడ స్త్రీలు పూజించబడుతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారు అనే మన సంస్కృతి గొప్పతనాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలోని టీచర్లు నాగమణి, పద్మా, భాగ్యలక్ష్మి, ఆయమ్మ యాదవ్వలకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బిక్షపతి, కనకయ్య, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మహిళలు ఏ పని తలపెట్టినా లక్ష్యాన్ని సాధించే వరకు వదిలిపెట్టరు. డ్వాక్రా మహిళల ఉత్పత్తుల కోసం తీసుకొచ్చిన స్వయం బ్రాండ్‌ను గ్లోబల్ స్థాయికి తీసుకెళ్తా. అప్పులు ఇప్పించే బాధ్యత నాది. సద్వినియోగం చేసుకోవడం మీ పని. ఇప్పటికే మహిళా పారిశ్రామికవేత్తలు లక్ష దాటారు. ఏడాదిలో మరో 5 లక్షల మందిని తయారుచేస్తాం.

- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

దేశాన్ని, రాజ్యాంగాన్ని అవమానించింది

- బెంగాల్ సర్కార్‌పై మండిపడ్డ ప్రధాని మోడీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 8 : రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బంగాల్ పర్యటనలో ప్రొటోకాల్ ఉల్లంఘనపై ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి స్పందించారు. దిల్లీలోని పలు ప్రాజెక్టులను ప్రారంభించిన మోదీ, అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఒక రోజు ముందు బంగాల్‌లోని టీఎంసీ ప్రభుత్వం రాష్ట్రపతిని తీవ్రంగా అవమానించిందని ఆరోపించారు. ఒక్క ముర్మునే మాత్రమే కాకుండా దేశాన్ని, రాజ్యాంగాన్ని కూడా అవమానించిందని మండిపడ్డారు. గిరిజన సమాజానికి చెందిన ముఖ్యమైన కార్యక్రమాన్ని టీఎంసీ బహిష్కరించిందని అన్నారు. రాష్ట్రపతికి గౌరవం ఇవ్వడంలో బెంగాల్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. సంతాల్ గిరిజన సమాజానికి ఆ వేడుక ఎంతో ప్రాధాన్యం కలిగినదని, రాష్ట్రపతి ముర్ము కూడా గిరిజన సమాజం నుంచే వచ్చిన నాయకురాలని గుర్తుచేశారు. గిరిజనుల సంక్షేమం పట్ల ఆమెకు ప్రత్యేక శ్రద్ధ ఉందని తెలిపారు. "దేశం అంతా మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్న సమయంలో, రాష్ట్రపతికి తగిన గౌరవం ఇవ్వకపోవడం ఆందోళన కలిగించే విషయం. ఇది కేవలం ఒక వ్యక్తికి జరిగిన అవమానం మాత్రమే కాదు, దేశ రాజ్యాంగానికి, ప్రజాస్వామ్య విలువలకు జరిగిన అవమానం" అని ప్రధాని అన్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బంగాల్ పర్యటనలో ప్రొటోకాల్ ఉల్లంఘనపై ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి స్పందించారు. దిల్లీలోని పలు ప్రాజెక్టులను ప్రారంభించిన మోదీ, అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఒక రోజు ముందు బంగాల్‌లోని టీఎంసీ ప్రభుత్వం రాష్ట్రపతిని తీవ్రంగా అవమానించిందని ఆరోపించారు. ఒక్క ముర్మునే మాత్రమే కాకుండా దేశాన్ని, రాజ్యాంగాన్ని కూడా అవమానించిందని మండిపడ్డారు. గిరిజన సమాజానికి చెందిన ముఖ్యమైన కార్యక్రమాన్ని టీఎంసీ బహిష్కరించిందని అన్నారు. రాష్ట్రపతికి గౌరవం ఇవ్వడంలో బెంగాల్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. సంతాల్ గిరిజన సమాజానికి ఆ వేడుక ఎంతో ప్రాధాన్యం కలిగినదని, రాష్ట్రపతి ముర్ము కూడా గిరిజన సమాజం నుంచే వచ్చిన నాయకురాలని గుర్తుచేశారు.

విశ్వ వీక్షణం

ప్రొటోకాల్ లోపాలపై వివరణ ఇవ్వండి

- బెంగాల్ సర్కార్‌కు కేంద్రం నోటీసులు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 8: బంగాల్‌లో రాష్ట్రపతి పర్యటన సందర్భంగా జరిగిన ప్రొటోకాల్ లోపాలు దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పర్యటనలో లోపాలను కేంద్రం సీరియస్‌గా తీసుకుంది. ఏర్పాట్లపై వివాదం నెలకొనడంతో కేంద్ర ప్రభుత్వం బంగాల్ ప్రభుత్వాన్ని వివరణ కోరింది. ఈ మేరకు ఆదివారం సాయంత్రం 5 గంటలలోగా సమాధానం ఇవ్వాలని కేంద్ర హోం శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ పంపింది.బంగాల్ ముఖ్య కార్యదర్శికి కేంద్ర హోంశాఖ కార్యదర్శి రాసిన లేఖలో రాష్ట్రపతి ముర్ము పర్యటన సమయంలో భద్రత, ప్రోటోకాల్, వేదిక ఏర్పాట్లు, మార్గ ఏర్పాట్లలో జరిగిన ఉల్లంఘనలపై పూర్తి వివరణ కోరారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, వారి కుటుంబ సభ్యుల భద్రతకు సంబంధించిన నియమాలు వివరించే గోప్య పత్రం అయిన బ్లూ బుక్ నిబంధనలు పాటించలేదని కేంద్రం అభిప్రాయపడింది. కాగా, సిలిగుడి సమీపంలోని బాగ్‌డోగ్రా విమానాశ్రయం వద్ద శనివారం జరిగిన గిరిజన సమాజ కార్యక్రమంలో రాష్ట్రపతి ముర్ము పాల్గొన్నారు. అయితే ఆ కార్యక్రమానికి తక్కువ సంఖ్యలో ప్రజలు హాజరుకావడం, ఏర్పాట్లు సరిగా లేకపోవడం పట్ల ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా కార్యక్రమం వేదికను ముందుగా నిర్ణయించిన బిధన్నగర్ నుంచి గోషాయిపుర్ ప్రాంతానికి మార్చడం సరైన నిర్ణయం కాదని ప్రశ్నించారు. "కార్యక్రమం బిధన్నగర్‌లో జరిగి ఉంటే మరింత మంది పాల్గొనేవారు. అక్కడ విస్తారమైన స్థలం ఉంది. కానీ ఎందుకు అక్కడ అనుమతి ఇవ్వలేదో నాకు తెలియదు. ఇక్కడికి ప్రజలు రావడం కష్టంగా ఉంది" అని ఆమె వ్యాఖ్యానించారు. అలాగే తన పర్యటన సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, రాష్ట్ర మంత్రులు ఎవరూ హాజరు కాకపోవడాన్ని కూడా ఆమె ప్రస్తావించారు. "మమతా బెనర్జీ నా చిన్న చెల్లెల్లాంటివారు. నేను కూడా బంగాల్ కూతురినే. ఆమె ఎందుకు రాలేదో తెలియదు. కానీ అది పెద్ద విషయం కాదు. మీ అందరూ సంతోషంగా ఉండాలి" అని రాష్ట్రపతి అన్నారు.

After Retirement ఓ టూరేస్కోండి!!

రిటైర్‌మెంట్ అంటే మనం పని భారం నుండి విముక్తి పొంది, మనకోసం కొంత సమయాన్ని వెచ్చించినప్పుడే జీవితం ఆనందకరంగా ఉంటుంది. ట్రావెలింగ్ అనేది ఈ సమయాన్ని గుర్తుండిపోయేలా చేయడానికి ఒక గొప్ప ఆప్షన్. కానీ కొన్నిసార్లు బడ్జెట్ లేకపోవడం వల్ల చాలా మంది ట్రిప్‌లు ప్లాన్ చేసుకోలేకపోతుంటారు. అటువంటి పరిస్థితిలో మన దేశంలో 10 సరసమైన రిటైర్మెంట్ గమ్యస్థానాల గురించి తెలుసుకుందాం. తక్కువ ఖర్చుతో కూడా సరదాగా గడపగలిగే అనేక ప్రదేశాలు భారతదేశంలో ఉన్నాయి? భారతదేశంలో అనేక అందమైన నగరాలు, పట్టణాలు సహజ సౌందర్యంతో నిండి ఉన్నాయి. ఈ ప్రదేశాలు బడ్జెట్‌కు అనుకూలమైనవి కూడా. విశేషమేమిటంటే, పదవీ విరమణ తర్వాత ఎక్కడికైనా వెళ్లాలనుకునే వారికి ఈ ప్రదేశాలు సరైనవి.



కేరళ

కేరళలోని పచ్చటి వాతావరణం, బ్యాక్ వాటర్స్, ఆయుర్వేద చికిత్స మరియు రుచికరమైన సముద్రపు ఆహారం మీ రిటైర్మెంట్ జీవితానికి కొత్త అనుభవాన్నిస్తాయి. ఇక్కడ మీరు హౌస్‌బోట్‌లో టూర్ చేయవచ్చు, యోగా మరియు ధ్యానం చేయవచ్చు. స్థానిక సంస్కృతిని ఆస్వాదించవచ్చు. మీరు హాయిగా ఉండేందుకు కేరళలో అనేక బడ్జెట్ అనుకూలమైన రిసార్ట్‌లు ఉన్నాయి.

గోవా

భారతదేశంలోని అత్యంత ప్రసిద్ధ పర్యాటక ప్రదేశం గోవా. ఇక్కడ మీరు అందమైన బీచ్‌లు, వాటర్ గేమ్‌లు, లైవ్ మ్యూజిక్‌తో పాటు రుచికరమైన ఆహారాన్ని ఆస్వాదించవచ్చు. గోవాలో మీరు బడ్జెట్ హోటల్స్ లేదా గెస్ట్ హౌస్‌లలో బస చేయవచ్చు, స్థానికంగా రవాణా కూడా తక్కువ ఖర్చుతోనే ఉంటుంది.

హిమాచల్ ప్రదేశ్

హిమాచల్ ప్రదేశ్‌లోని పచ్చని లోయలు, నిర్మలమైన దేవాలయాలు, మంచుతో కప్పబడిన పర్వతాలు మిమ్మల్ని ప్రకృతికి దగ్గర చేస్తాయి. ఇక్కడ మీరు ట్రెక్కింగ్, పారాగ్లైడింగ్, స్కీయింగ్ వంటి సాహస కార్యకలాపాలను ఆస్వాదించవచ్చు. హిమాచల్ ప్రదేశ్‌లో చాలా చిన్న పట్టణాలు, గ్రామాలు ఉన్నాయి.

కాశ్మీర్

కాశ్మీర్ అందాలను చూసేందుకు సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు వస్తుంటారు. ఇక్కడ ఉన్న సరస్సులు, తోటలు మరియు హౌస్‌బోట్‌లు మీకు అద్భుతమైన అనుభూతిని అందిస్తాయి. కాశ్మీర్‌లో మీరు షికారా పర్యటనలో పాల్గొనవచ్చు. స్థానిక మార్కెట్‌లను సందర్శించవచ్చు మరియు కాశ్మీరీ వంటకాలను రుచి చూడవచ్చు.

రాజస్థాన్

రాజస్థాన్ చరిత్ర, సంస్కృతి మరియు వాస్తుశిల్పాలు మిమ్మల్ని మంత్రముగ్ధులను చేస్తాయి. ఇక్కడ ఉన్న కోటలు, రాజభవనాలు, దేవాలయాలు మరియు భవనాలు మీకు తప్పకుండా రాచరికపు జీవితాన్ని ఆస్వాదించేలా చేస్తాయి. రాజస్థాన్‌లో జైపూర్, ఉదయపూర్, జోధ్‌పూర్ మరియు జైసల్మేర్ వంటి నగరాలను అతి తక్కువ ఖర్చుతో సందర్శించవచ్చు.

ఉత్తరాఖండ్

ఉత్తరాఖండ్‌ని దేవభూమి అంటారు. ఇక్కడ ఉన్న పవిత్ర నదులు, పురాతన దేవాలయాలు మరియు యోగా కేంద్రాలు మీకు ఆధ్యాత్మిక శాంతిని అందిస్తాయి. ఉత్తరాఖండ్‌లో మీరు రిషికేశ్, హరిద్వార్, బద్రీనాథ్ మరియు కేదార్‌నాథ్ వంటి పుణ్యక్షేత్రాలను సందర్శించవచ్చు.

మేఘాలయ

మేఘాలయలోని అందమైన లోయలు, శక్తివంతమైన సంస్కృతి మరియు రుచికరమైన ఆహారం మీకు ప్రత్యేకమైన అనుభూతిని అందిస్తాయి. ఇక్కడ మీరు లివింగ్ రూట్ బ్రిడ్జ్, గుహలు మరియు జలపాతాలను చూడవచ్చు. మేఘాలయలో మీరు షిల్లాంగ్ మరియు చిరపుంజీ వంటి నగరాలను సందర్శించవచ్చు.

ఒడిశా

ఒడిశా చాలా గొప్ప చరిత్ర, సంస్కృతిని కలిగి ఉంది. ఇక్కడి దేవాలయాలు, బీచ్‌లు మరియు ప్రకృతి అందాలు మిమ్మల్ని మంత్రముగ్ధులను చేస్తాయి. ఒడిశాలో మీరు కోణార్క్ టెంపుల్, పూరి, భువనేశ్వర్ వంటి నగరాలను సందర్శించవచ్చు.

తమిళనాడు

తమిళనాడు సంస్కృతి, కళ మరియు వాస్తుశిల్పం మిమ్మల్ని మంత్రముగ్ధులను చేస్తాయి. ఇక్కడి దేవాలయాలు, బీచ్‌లు మరియు హిల్ స్టేషన్‌లు మీకు అద్భుతమైన అనుభూతిని అందిస్తాయి. తమిళనాడులో మీరు మధురై, చెన్నై, కుంభకోణం మరియు ఊటీ వంటి నగరాలను సందర్శించవచ్చు.

ఉత్తరప్రదేశ్

ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి పవిత్ర నగరం. ఇక్కడ గంగా ఆరతి, ఆలయ దర్శనం మరియు ఘాట్‌లలో గడిపిన సమయం మీకు ఆధ్యాత్మిక ప్రశాంతతను ఇస్తుంది. ఇక్కడ అనేక రుచికరమైన ఆహారాలను ఆస్వాదిస్తారు.











గల్ఫ్ నుండి 50 వేల మంది రిటర్న్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 8: పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న క్రమంలో ఈ నెల 1 నుంచి 7 వరకు గల్ఫ్ దేశాల నుంచి 52 వేల మంది భారతీయులు సురక్షితంగా భారత్‌కు తిరిగి వచ్చేశారని భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) శనివారం తెలిపింది. వీరిలో 32,107 మంది ఇండియన్ ఎయిర్‌లైన్స్ ద్వారా, మిగిలిన వారు ఇతర వాణిజ్య, నాన్ షెడ్యూల్డ్ విమానాల ద్వారా భారత్‌కు చేరుకున్నారని తెలిపింది. గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయిన భారతీయుల కోసం ఒక ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, బాధితులకు, వారి కుటుంబ సభ్యులకు దీని ద్వారా సహాయం అందజేస్తున్నట్టు ఎంఈఏ వివరించింది. అక్కడ ఉండిపోయిన భారతీయులు స్థానిక అధికారులు, దౌత్య కార్యాలయాలు, కాన్సులేట్లు ఇచ్చే మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కోరింది.

జేడీయూలో చేరిన నితీశ్ కుమారుడు నిశాంత్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 8 : బిహార్ సీఎం నీతీశ్‌కుమార్ కుమారుడు నిశాంత్ కుమార్ జేడీయూలో చేరారు. పట్నాలోని జేడీయూ హెడ్‌క్వార్టర్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి రాజీవ్ రంజన్‌సింగ్, జేడీయూ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సంజయ్ ఝా సహా పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిశాంత్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. తన తండ్రి పెద్దల సభకు వెళ్లాలని నిర్ణయించుకున్నారని, అది ఆయన సొంతంగా తీసుకున్న నిర్ణయమని పేర్కొన్నారు. ఆయన నిర్ణయాన్ని అందరం గౌరవిస్తున్నట్లు చెప్పారు. తనతండ్రి మార్గదర్శకత్వంలో తామంతా పనిచేస్తామని నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. 20ఏళ్లు బిహార్ ముఖ్యమంత్రిగా పనిచేసిన తన తండ్రి రాష్ట్రానికి ఎంతో సేవ చేశారని చెప్పారు. బిహార్ ప్రజలు ఆయన చేసిన అభివృద్ధిని ఎప్పటికీ మరిచిపోరని తెలిపారు. పార్టీ కండువా కప్పుకున్న అనంతరం తండ్రి నీతీశ్‌ను కలిసి మిఠాయి తినిపించారు. ఆయన వెంట సంజయ్ ఝా కూడా ఉన్నారు. మరోవైపు, బిహార్‌లో కొత్తగా ఏర్పడే ప్రభుత్వంలో నిశాంత్ డిప్యూటీ సీఎం అవుతారని ఊహాగానాలు జోరుగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో నీతీశ్ కుమార్ సన్నిహితుడు ఒకరు శనివారం మాట్లాడారు. తండ్రి రాజీనామా అనంతరం ఏర్పడే కొత్త ప్రభుత్వంలో నిశాంత్‌ను డిప్యూటీ సీఎంగా చేయాలని ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ గురువారం రాజ్యసభ ఎన్నికలకు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.

28 నుంచి ఐపీఎల్

క్రికెట్ అభిమానులకు మరో పండుగ రాబోతున్నది. ఇప్పటికే టీ20 ప్రపంచకప్ టోర్నీతో తడిసిముద్ద యిన ఫ్యాన్స్‌కు మరింత మజాను అందించేందుకు ఐపీఎల్ సర్వహంగులతో రాబోతున్నది. పొట్టి ప్రపంచకప్ ఇలా ముగిసిందో లేదో మరో రెండు నెలల పాటు ఫ్యాన్స్‌ను అలరించేందుకు ఈనెల 28 నుంచి ఐపీఎల్ మొదలుకాబోతున్నది. ఈ మేరకు లీగ్ అధికారిక బ్రాడ్‌కాస్టర్ స్టార్‌స్పోర్ట్స్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. అయితే ఐపీఎల్ అధికారిక షెడ్యూల్ విడుదల కావాల్సి ఉంది. మే నెలాఖరు వరకు జరిగే అవకాశమున్న ఐపీఎల్ 19వ సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతున్నది.

ప్రతిపక్షం
Prathipaksham.in
8
హైదరాబాద్
సోమవారం
09.03.2026
సినిమా

విశ్వ విజేత ఇండియా

వరుసగా మూడో సారి టీ20 ఛాంపియన్ గా

డిఫెండింగ్ ఛాంపియన్ భారత జట్టు చరిత్ర సృష్టించింది. స్వదేశంలో సంపూర్ణ ఆధిపత్యంతో రికార్డు స్థాయిలో మూడోసారి టీ20 ప్రపంచకప్‌ను కొల్లగొట్టింది. ఏకపక్షంగా సాగిన ఫైనల్లో అసలైన ఆటతో న్యూజిలాండ్‌ను చిత్తుగా ఓడించింది టీమిండియా. ఓపెనర్లు సంజూ శాంసన్(89), అభిషేక్ శర్మ(52), ఇషాన్ కిషన్(54)ల మెరుపులతో ప్రత్యర్థిని సగం దెబ్బతీసిన సూర్యకుమార్ యాదవ్ సేన.. బుమ్రా(415), అక్షర్ పటేల్(327) సంచలన బౌలింగ్‌తో పడగొట్టింది. పరుగు విజయంతో పొట్టి కప్‌లో మరే ఆతిథ్య జట్టుకు సాధ్యపడని విధంగా ప్రపంచకప్‌ను పట్టేసింది. ఈ విక్టరీతో కివీస్ ఫోబియాను.. నరేంద్ర మోడీ స్టేడియంలో ఫైనల్ భయాన్ని భారత్ అధిగమించింది. స్వదేశంలో టీ20 ప్రపంచకప్‌లో ఫేవరెట్‌గా అడుగుపెట్టిన భారత్ ఛాంపియన్‌గా మురిసిపోయింది. లీగ్ దశను అజేయంగా ముగించి.. సూపర్ 8 తొలి మ్యాచ్‌లోనే దక్షిణాఫ్రికా చేతిలో 76 పరుగుల తేడాతో ఓడిన టీమిండియా అద్భుతంగా పుంజుకుంది. సంజూ శాంసన్(89) మెరుపులతో సెమీస్‌లో ఇంగ్లండ్‌ను చిత్తు చేసిన సూర్యకుమార్ యాదవ్ సేన ఫైనల్లోనూ పంజా విసిరింది. 255 పరుగులతో న్యూజిలాండ్‌ను భయపెట్టిన భారత జట్టు.. బౌలింగ్‌లోనూ ఇరగదీసింది. బుమ్రా, అక్షర్ పటేల్ విజృంభణతో ఆరంభం నుంచి వికెట్లు కోల్పోయిన కివీస్ ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. అభిషేక్ శర్మ ఓవర్లో చివరి వికెట్‌గా వెనుదిరగగా.. టీమిండియా మూడోసారి టీ20 ఛాంపియన్‌గా నిలిచింది. ప్రపంచకప్ ఫైనల్లో భారత్ నిర్దేశించిన రికార్డు ఛేదనలో న్యూజిలాండ్ తడబడింది. పవర్ ప్లేలోనే బంతి అందుకున్న అక్షర్ పటేల్(218) తొ ఓవర్లోనే డేంజరస్ ఫిన్ అలెన్(9)ను ఔట్ చేసి బ్రేకిచ్చాడు. ఆ తర్వాతి ఓవర్లో.. సిక్సర్ బాదిన గ్లెన్ ఫిలిఫ్స్(5)ను క్లీన్‌బౌల్డ్ చేసి కివీస్‌కు మరో షాకిచ్చాడీ ఆల్‌రౌండర్. అంతకు ముందు ఓవర్లో బుమ్రా ఫైనల్ లెగ్ దిశలో బంతిని గాల్లోకి లేపిన రచిన్ రవీంద్ర(1)ను ఇషాన్ డైవింగ్ క్యాచ్‌తో పెవిలియన్ పంపాడు. పవర్ ప్లేలోనే మూడు బిగ్ వికెట్లు కోల్పోయిన న్యూజిలాండ్‌ను ఓపెనర్ టిమ్ సీఫర్ట్(52), మార్క్ చాప్‌మన్(3)లు ఆదుకోవాలనుకున్నా సాధ్యపడలే. వరుణ్ చక్రవర్తి ఓవర్లో సీఫర్ట్‌ను ఇషాన్ బౌండరీ క్యాచ్‌తో డగౌట్ చేర్చగా.. పాండ్యా ఓవర్లో బంతిని వికెట్ల మీదకు ఆడుకున్న చాప్‌మన్ వెనుదిరిగాడు. అంతే.. 72కే సగం వికెట్లు పడడంతో కివీస్ ఓటమి అంచున నిలిచింది. ఆ దశలో కెప్టెన్ మిచెల్ శాంట్నర్(43), దారిల్ మిచెల్ (17) పరుగుల అంతరం తగ్గించేందుకు పోరాడారు. జేమ్స్ నీషమ్(8)ను స్లోయార్కర్‌తో బుమ్రా బౌల్డ్ చేశాడు. ఆ తర్వాతి బంతికే మ్యాట్ హెన్రీ(0)ని బౌల్డ్ చేసి హ్యాట్రిక్‌పై నిలిచాడు. కానీ.. ఫెర్గూసన్ సింగిల్ తీశాడు. కాసేపటికే అభిషేక్ ఓవర్లో జాకబ్ డఫ్ఫీ చివరి వికెట్‌గా వెనుదిరగడంతో 96 పరుగుల తేడాతో టీమిండియా జయకేతనం ఎగురవేసింది. ఫైనల్లో భారత టాపార్డర్ ఊచకోతకు న్యూజిలాండ్ బౌలర్లు బలైపోయారు. ఓపెనర్ అభిషేక్ శర్మ(52) ఫామ్ అందుకుంటూ అర్ధ శతకం బాదేయగా.. హ్యాట్రిక్ హాఫ్ సెంచరీతో సంజూ శాంసన్(89) చెలరేగిపోయాడు. వీరిద్దరి మెరుపులతో కుదేలైన కివీస్ బౌలర్లను ఇషాన్ కిషన్(54) తుఫాన్ ఇన్నింగ్స్‌తో భయపెట్టాడు. జేమ్స్ నీషమ్(346) ఒకే ఓవర్లో మూడు వికెట్లతో కాస్త స్కోర్ తగ్గినా.. ఆఖర్లో శివం దూబే(26 నాటౌట్) మెరుపులతో భారత్ నిర్ణీత ఓవర్లలో 255 పరుగులతో కివీస్‌కు రికార్డు లక్ష్యాన్ని నిర్దేశించింది.

హాకీ వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్ లో అమ్మాయిల శుభారంభం..

గచ్చిబౌలి స్టేడియం వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక హాకీ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్ టోర్నీలో ఆతిథ్య భారత మహిళల జట్టు అదిరిపోయే బోణీ కొట్టింది. ఆదివారం జరిగిన గ్రూపుబీ తొలి పోరులో భారత్ 40 తేడాతో ఉరుగ్వేపై ఘన విజయం సాధించింది. మ్యాచ్ ఆద్యంతం ఆధిపత్యం ప్రదర్శించిన టీమ్‌ఇండియా తరఫున సునెలిటా తొపో(21ని), ఇషిక(40ని), లాల్‌రెసియామి(49ని), రుతుజా దాదాసో(58ని) గోల్స్ చేశారు. మ్యాచ్‌లో ఆది నుంచే టీమ్‌ఇండియా స్ట్రైకర్లు దూకుడు కనబరిచారు.

'ది బ్లాక్ గోల్డ్' నుంచి సంయుక్త పోస్టర్ రిలీజ్

వెర్సటైల్ హీరోయిన్ సంయుక్త ప్రస్తుతం తన కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ హైవోల్టేజ్, హీరోయిన్‌సెంట్రిక్ పాన్‌ఇండియన్ యాక్షన్ డ్రామా 'ది బ్లాక్ గోల్డ్'లో నటిస్తున్నారు. యోగేష్ కెఎంసి దర్శకత్వంలో హాస్య మూవీస్ బ్యానర్‌పై మాగంటి పిక్చర్స్‌తో కలిసి రాజేష్ దండా నిర్మిస్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'ది బ్లాక్ గోల్డ్' టీం ఒక పవర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో హీరోయిన్ సంయుక్త ప్రమాదకరమైన మైనింగ్ ప్రాంతం మధ్యలో నిలబడి కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. కథలోని కఠినమైన పరిస్థితులను ప్రతిబింబించేలా ఆ మైనింగ్ బ్యాక్‌డ్రాప్‌ను చూపించారు. పోస్టర్‌లో సంయుక్త చేతిలో రైఫిల్ పట్టుకుని కనిపించారు. ఆమె ముఖం మీద దుమ్ము, చేతులపై గాయాలు కనిపించడం కథలో ఘర్షణను ప్రజెంట్ చేస్తోంది. ఈ లుక్ సినిమాలోని రా, ఇంటెన్స్ టోన్‌కు పర్ఫెక్ట్ యాప్ట్. పోస్టర్‌లో బ్యాక్‌గ్రౌండ్‌లో కనిపించే అగ్నిప్రమాదాలు, బొగ్గుతో నిండిన రైలు మైనింగ్ ప్రాంతం గుండా దూసుకెళ్తున్న విజువల్స్ సినిమా భారీ యాక్షన్ స్థాయిని సూచిస్తున్నాయి. “She Believes in the Law, Not the Gun!” అనే ఆసక్తికర ట్యాగ్‌లైన్ కథలోని హీరోయిన్ పాత్రపై క్యూరియాసిటీని పెంచుతోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ చివరి దశలో ఉంది. కేవలం చివరి షెడ్యూల్ మాత్రమే మిగిలి ఉంది. ఫ్రెష్ కథనం, ఇంటెన్స్ యాక్షన్ సన్నివేశాలతో రూపొందుతున్న ఈ కమర్షియల్ యాక్షన్ డ్రామా 2026 సమ్మర్‌లో థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది.

సల్మాన్ ఖాన్ జోడీగా...

ప్రస్తుతం ఆ భాష, ఈ భాష అని లేకుండా, అన్ని భాషల్లోనూ సినిమాలు చేస్తూ సత్తా చాటుతున్నది నయనతార. మెగాస్టార్‌తో ఆమె రీసెంట్ హిట్ 'మన శంకర వరప్రసాద్‌గారు' టాలీవుడ్ రీజనల్ సినిమాల్లో నంబర్‌వన్ హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం బాలకృష్ణ 'NBK 111'లో కథానాయికగా నటిస్తున్నది నయనతార. ఇక తమిళంలో అయితే.. ఆమె చేతిలో చాలా సినిమాలున్నాయి. ఇదిలావుంటే.. రీసెంట్‌గా ఓ బాలీవుడ్ సినిమాకు నయన్ సైన్ చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్‌ఖాన్ హీరోగా రూపొందనున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రానికి టాలీవుడ్ డైరెక్టర్ పైడిపల్లి వంశీ దర్శకుడు. దిల్‌రాజు నిర్మిస్తారట. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే రానున్నది. ఇక నయన్ నటించిన తమిళ చిత్రం 'ముక్తీ అమ్మన్' సమ్మర్‌లో విడుదల కానుంది.

'గాయపడ్డ సింహం'

అందరికీ కనెక్ట్ అయ్యే ఎంటర్ టైనర్

సాంగ్ లాంచ్ ఈవెంట్ లో హీరో తరుణ్ భాస్కర్

డిఫరెంట్ ఎంటర్టైనర్స్ చేస్తున్న తరుణ్ భాస్కర్, రైటర్ డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్‌తో కలిసి 'గాయపడ్డ సింహం' తో అలరించబోతున్నారు. ఈ చిత్రాన్ని సప్తస్వ మీడియా వర్క్స్, పిఓవి స్టోరీస్, జీ స్టూడియోస్ నిర్మిస్తున్నాయి. పవన్ సాదినేని ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఇటివల విడుదలైన ఫన్ ఫిల్డ్ ట్రైజర్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా సినిమాకు సంబంధించిన ఫన్ ప్రమోషనల్ ర్యాప్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పాట సినిమా సాటైరికల్ టోన్‌ను అద్భుతంగా ప్రజెంట్ చేస్తోంది. ఈ పాట హీరో అమెరికన్ డ్రీమ్ ఎలా ఒక్కసారిగా తలకిందులవుతుందో చూపిస్తుంది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించిన డిపోర్టేషన్ నిర్ణయం తర్వాత హీరో జీవితంలో ఏర్పడే గందరగోళ పరిస్థితులను సరదాగా చూపించారు. ట్రెండీ బీట్స్‌తో రూపొందిన ఈ ర్యాప్ సాంగ్‌ను సంగీత దర్శకుడు స్వీకర్ అగస్తి స్వయంగా ఆలపించగా, ర్యాప్ పార్ట్స్ అసుర పాడారు. సాహిత్యాన్ని కూడా స్వీకర్ అగస్తి రాయగా, అసురా ర్యాప్ వర్సెస్ అందించారు. పాస్‌పోర్ట్‌పై పడే రిజెక్షన్ స్టాంపులు, ట్రంప్ విగ్రహాలు, “హ్యాపీ డిపోర్టేషన్” కేక్ కట్టింగ్ వంటి సరదా సన్నివేశాలతో పాట వినోదాత్మకంగా సాగుతుంది. వీడియోలో ఎనర్జీతో నిండిన డ్యాన్స్ మూమెంట్స్, సరదా విజువల్స్ ప్రత్యేకంగా ఆకట్టుకుంటాయి. తరుణ్ భాస్కర్ తన డెడ్‌పాన్ హ్యూమర్‌తో నవ్వులు పండించగా, విష్ణు ఓయి బడ్డీ వైబ్‌ను తీసుకొచ్చారు. టైటిల్‌కు తగినట్లు ఒక సింహం కూడా విజువల్‌గా కనిపిస్తూ కథలోని “గాయపడ్డ సింహం”ను సూచిస్తుంది. స్వీకర్ అగస్తి, అసురా కూడా వీడియోలో కనిపిస్తూ ఫన్ మరింత పెంచారు. ఈ చిత్రంలో మానస చౌదరి, ఫరియా అబ్దుల్లా కథానాయికలు కాగా, హర్షవర్ధన్, శుభలేఖ సుధాకర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రం 2026 వేసవిలో థియేటర్లలో విడుదల కానుంది. సాంగ్ లాంచ్ ఈవెంట్లో హీరో తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ.. ఈ సాంగ్ మీ అందరికీ నచ్చడం హ్యాపీగా వుంది. కశ్యప్ శ్రీనివాస్ తన కాలేజ్ డేస్ నుంచే చాలా కష్టపడి షార్ట్ ఫిలిమ్స్ తీసి తనకంటూ ఒక పేరు తెచ్చుకున్నాడు. ఈ సినిమాతో తను దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. అసలైన హీరో ఈ సినిమాకి ఆయన, ఆయన కథ. కష్టపడ్డ సింహం ఆయన. అదృష్టమైన సింహాన్ని నేను. మా నిర్మాతలకి థాంక్ యు. తప్పకుండా ఈ సినిమాని మీ ఫ్రెండ్స్ తో ఫ్యామిలీతో కలిసి చూడండి. అన్నారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana- 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200